

పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలి: కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం టౌన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉద్యోగ, ఉపాధి కల్పించడానికి అత్యంత కీలకమైనవి పరిశ్రమలు అని, వాటిని స్థాపించే పారిశ్రామికవేత్తలను అన్ని విధాలుగా ప్రోత్సహించాలని అధికారులను కలెక్టర్ వినోదకుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం పరిశ్రమలపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న అన్నిరకాల పారిశ్రామికవేత్తలు, సేవా, వ్యాపార సంస్థల ప్రతినిధులు ఉద్యమ్ రిజిస్ట్రేషన్‌లో నమోదు కావాలన్నారు. సర్వేలో భాగంగా క్షేత్ర స్థాయిలో పరిశ్రమల అధికారులు, ఎంపీడీఓలు, మండల ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు,కమర్షియల్ టాక్స్ అధికారులు, అన్ని ట్రేడ్‌యూనియన్స్‌తో సమావేశాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పించాలన్నారు. మొబైల్ యాప్, గ్రామ సచివాలయాల సిబ్బంది ద్వారా వారి వివరాలు నమోదు చేసేలా అవగాహన కల్పించాలని తెలిపారు. 2020-23, 2023-27 వరకు ఇండస్ట్రియల్ పాలసీల మేరకు 9 యూనిట్లకుగాను రూ.40.58 లక్షల సబ్సిడీ మంజూరుకు ఆమోదం తెలిపారు. సింగిల్‌విండో పోర్టల్‌లో పారిశ్రామిక వేత్తలు దరఖాస్తు చేసుకున్న వెంటనే పరిశీలించి అనుమతులు ఇవ్వాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా పరిశ్రల అధికారి శ్రీధర్, వ్యవసాయశాఖాధికారి ఉమామహేశ్వరమ్మ, విద్యుత్ ఎస్ఈ సంపత్‌కుమార్, డీటీసీ వీర్రాజు, కమర్షియల్ టాక్స్ అధికారి మురళీమోహన్‌తోపాటు పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడుతున్న ప్రశాంతి నిలయం



సర్వం సిద్ధం

సాయి విద్యావిధానం... ఆదర్శం

శ్రీసత్యసాయి వర్సిటీ స్నాతకోత్సవంలో వక్తలు

విద్యార్థులకు బంగారు పతకాల పంపిణీ

నేడు సత్యసాయిబాబా జయంత్యుత్సవం

దేశవిదేశాల నుంచి వచ్చిన భక్తులు

ముఖ్యఅతిథిగా గవర్నర్ అబ్దుల్ నజీర్

పోలీస్ వలయంలో పుట్టపర్తి


వివరాలు 6వ పేజీలో....

చీకటి..వెలుగుల కథ

నగరానికి 682 ఎల్ఈడీ లైట్ల కోసం టెండర్

- బోగస్ పత్రాలతో కొందరు టెండరు దాఖలు
- 25శాతం లెస్‌తో దక్కించుకున్న ప్రొలైట్ సంస్థ
- అనంత నగరంలో వీధిలైట్ల సమస్య
- 8నెలలుగా నగరపాలికలో లైట్లు లేని వైనం
- అంధకారంలోనే కొన్ని కాలనీలు
- మొదటి టెండర్‌లో సరఫరా చేయలేని కాంట్రాక్టర్

అనంతపురం క్రైం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి) : అనంతపురం నగరపాలిక అలసత్వానికి పరాకాష్టగా నిలుస్తోంది. ప్రజల సమస్యలను అటు పాలకవర్గం, ఇటు అధికారులు పట్టించుకోవడం లేదు. నగరంలో వీధి లైట్ల సమస్య ఎప్పటి నుంచో ఉంది. ప్రధాన రహదారులు మొదలుకొని కాలనీల్లోని సందుల వరకు ఇదే సమస్య. ఎన్నో కాలనీలు అంధకారంలోనే ఉంటున్నాయి. కానీ ఇవేవీ నగరపాలిక అధికారులకు కనిపించవు. వీధి లైట్లు తెప్పించలేని దుస్థితిలో ఉన్నారు. గత 8నెలలుగా ఇదే పరిస్థితి ఉన్నా అడిగే దిక్కు లేదు. ఆరు నెలల కిందట టెండరు పిలిచారు. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ లైట్లు సరఫరా చేయలేదు. కేవలం నోటీసులతో సరిపెట్టి టెండరు రద్దు చేశారు. మరోసారి టెండరు పిలిచారు. ఏకంగా ఆరు సంస్థలు పోటీ పడ్డాయి. కాగా వీటిలో కొందరు బోగస్ సర్టిఫికెట్లు పొందుపరిచినట్లు అధికారుల విచారణలో తేలింది. హైదరాబాద్‌కు చెందిన ప్రొలైట్ సంస్థ 25శాతం లెస్‌తో ఆ టెండర్లను దక్కించుకుంది. మరి ఆ సంస్థ ఎంత త్వరగా నగరానికి లైట్లు సరఫరా చేస్తుందో వేచి చూడాల్సిందే.





పాతూరు గాంధీ సర్కిల్‌లో వెలగని లైట్లు

682 లైట్ల కోసం...

అనంతపురం నగరంలో 50 డివిజన్లున్నాయి. ఈ డివిజన్ల పరిధిలో వందల కాలనీలున్నాయి. వేల సంఖ్యలో వీధి లైట్లున్నాయి. వాటిలో కొన్ని తరచూ మరమ్మతుకు గురవుతుంటాయి. ఎనిమిది నెలలుగా వీధిలైట్ల సమస్య నెలకొంది. చాలా కాలనీల్లో ఈ పరిస్థితి నెలకొంది. ఇంజనీరింగ్ అధికారులు నగరం మొత్తం 682 ఎల్ఈడీ లైట్ల కోసం టెండరు పిలిచారు. ఆ లైట్ల కోసం రూ.18,08,664లు, ఎంఎస్ క్లాంప్స్‌కు రూ.3,13,856, జీఐ పైప్ కోసం రూ.2,43,883, డబ్ల్యుపీఎస్‌సీ వైర్‌కు రూ.63770, టేప్ రోల్‌కు రూ.4400, అదనంగా డబ్ల్యుపీఎస్‌సీ వైర్‌కు రూ.73920 అంచనాతో మొత్తం రూ.30లక్షలతో టెండరు పిలిచారు.

టెండర్ వచ్చినా సరఫరా చేయలేదు

ఆరు నెలల కిందట ఎల్ఈడీ లైట్ల కోసం టెండరు పిలిచారు. ఆ సమయంలో మురళి అనే కాంట్రాక్టర్ టెండర్ దక్కించుకున్నాడు. నెలలు గడిచినా ఆ కాంట్రాక్టర్ లైట్లు సరఫరా చేయలేదు. అధికారులు సైతం తూతూ మంత్రంగా మూడు సార్లు నోటీసులిచ్చి చేతులు దులిపేసుకున్నారు. ఆ టెండర్‌లో సైతం అర్హత లేకపోయినా అర్హత ఉన్నట్లు ఫేక్ సర్టిఫికెట్లు జమ చేసినట్లు సమాచారం.

నాలుగు డిస్‌క్వాలిఫై అయ్యాయి

ఎల్ఈడీ లైట్ల కోసం ఆరు సంస్థలు టెండరు దాఖలు చేశాయి. అందులో నాలుగు డిస్ క్వాలిఫై అయ్యాయి. క్వాలిఫై అయిన శివశంకరయ్య, ప్రొలైట్ ఇండియా సంస్థల్లో 25శాతం లెస్‌తో ప్రొలైట్ ఇండియాకు టెండర్ దక్కింది. - షాకీర్, ఈఈ

టెండరు దక్కించుకున్న వ్యక్తి ఎలాంటి లైట్లను పంపిణీ చేస్తాడనే అనుమానం ఉంటుంది. అన్ని అర్హతలున్న వారైతేనే చేయగలరనే నమ్మకముంటుంది. గత నెలలో ఇంజనీరింగ్ అధికారులు ఎల్ఈడీ లైట్లకు సంబంధించి టెండరు పిలిచారు. ఆరు సంస్థలు పోటీపడ్డాయి. రాజశేఖర్‌రెడ్డి, ఎస్‌వీ ఇన్‌ఫ్రా, రాజప్రసాద్‌రెడ్డి, శివశంకరయ్య, పూజారి రమేష్, ప్రొలైట్ ఇండియా పేర్లతో టెండరు దాఖలు చేశారు. వారందరూ తమకు ఫలానా కంపెనీలతో ఆథరైజ్డ్ ఉందన్నట్లు పత్రాలు పొందు పరిచారు. దీంతో వాటిలో ఏ సంస్థకు అర్హతా ప్రమాణాలున్నాయనే విషయంలో ఇంజనీరింగ్ అధికారులు నిర్ధారించాలనుకున్నారు. దీంతో ఆయా సంస్థలు పంపిన పత్రాలను సంబంధిత లైట్లు ఉత్పత్తి చేసే కంపెనీలకు పంపారు. టెండరు వేసిన ఆరింటిలో నాలుగింటికి తాము అలా ఆథరైజ్డ్ ఇవ్వలేదన్నట్లు వాటి నుంచి రిప్లై వచ్చింది. దీంతో శివశంకరయ్య, ప్రొలైట్ ఇండియా పేర్లతో టెండరు వేసిన సంస్థలను అర్హులుగా తేల్చారు. చివరికి 25శాతం లెస్‌తో వేసిన ప్రొలైట్ ఇండియా ఆ టెండరు దక్కించుకుంది.

ఆరు సంస్థలు పోటీపడినా... అర్హులకే టెండర్

దెబ్బతిన్న పంటలకు పరిహారం అందించండి

విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, పలువురు మంత్రులకు ఎమ్మెల్యే పరిటాల సునీత విజ్ఞప్తి



మంత్రి నారా లోకేశ్‌ను కలిసిన రాప్తాడు ఎమ్మెల్యే సునీత

అనంతపురం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ఇటీవల వర్షాలకు రాప్తాడు నియోజకవర్గంలో దెబ్బతిన్న పంటలకు పరిహారం అందించాలని ఎమ్మెల్యే పరిటాల సునీత రాష్ట్రవిద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌తో పాటు పలువురు మంత్రులను కోరారు. ఈ మేరకు శుక్రవారం అసెంబ్లీ ఆవరణంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు, రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఓఎస్‌డీని కలిసి వినతి పత్రాలు అందజేశారు. గత ప్రభుత్వంలో ఇళ్ల నిర్మాణాల పేరుతో మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డికి సంబంధించిన రాక్రీట్ సంస్థ చేసిన దోపిడీ, పింఛన్లు, రేషన్‌కార్డుల తొలగింపు, భూ అక్రమాలపై మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్లారు. వీటిపై నారా లోకేశ్ స్పందిస్తూ... కచ్చితంగా విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు. వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడును కలిసి ఇటీవల వర్షాలకు దెబ్బతిన్న పంటలకు పరిహారం ఇవ్వడంతో పాటు 10 ఎకరాలున్న రైతులకు 90 శాతం సబ్సిడీ డ్రిప్ మంజూరు చేయాలన్నారు. కరువు ప్రాంతమైన అనంతపురం జిల్లాలో పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని సబ్సిడీలు ఇవ్వాలన్నారు. గత ప్రభుత్వంలో తెలుగుదేశం పార్టీ సానుభూతిపరుల రేషన్‌కార్డులు, పింఛన్లు తొలగించారని, నేటికీ అవి పునరుద్ధరించలేదన్నారు. దీనివల్ల చాలా మంది పార్టీ సానుభూతిపరులు నష్టపోతున్నారన్నారు. కొత్త పథకాలకు అర్హత కోల్పోతున్నారన్నారు. అనంతరం రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను కలిసి ఆత్మకూరు, అనంతపురం రూరల్ తహసీల్దార్ కార్యాలయాలకు భవనాలు మంజూరు చేయాలని కోరారు. డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి పవన్‌కల్యాణ్ ఓఎస్డీని కలిసి పండమేరు బ్రిడ్జి నిర్మాణానికి రూ. 1.8 కోట్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గంలో పలు గ్రామాలకు రోడ్లు మంజూరు, పెండింగ్‌లో ఉన్న తాగునీటి పథకాల అంశాల గురించి వివరించారు. వీటన్నింటిపై మంత్రులు సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే పరిటాల సునీత తెలిపారు.

పైరవీలే పెట్టుబడిగా..

ఏఎస్ఓ పోస్టు కోసం అనర్హుడి ఆరాటం

- గతంలో ఏఎస్ఓగా భారీ అక్రమాలు..
- అప్పట్లో కొత్త డీఈఓ వేటు
- తాజాగా టీడీపీ ఎమ్మెల్యే లేఖలతో ఎంట్రీకి యత్నాలు
- చెక్ పెడతారా..? చేరదీస్తారా..?



అనంతపురం విద్య, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ఆయన పైరవీల ముందు ఏ నిబంధనలు పని చేయవు. అర్హత లేకున్నా అనుకున్న పోస్టు పట్టేస్తారు. ఈక్రమంలోనే పైరవీలే పెట్టుబడిగా అప్పట్లో జిల్లా విద్యాశాఖలో కీలకమైన ఏఎస్ఓ పోస్టు పొందారు. భారీ అక్రమాలతో వసూళ్లకు తెగబడ్డారు. అయితే పాత డీఈఓ స్థానంలో కొత్త డీఈఓ వచ్చారు. ఆయన అక్రమాలు తెలుసుకుని డీఈఓ ఆఫీసుకు దూరంగా విసిరేశారు. అయితే అప్పటి ప్రభుత్వంలో తనను పట్టించుకునేవారు లేకపోవడంతో ఐదేళ్లు కిక్కురుమనకుండా ఉండిపోయారు. ఇప్పుడు మళ్లీ కూటమి ప్రభుత్వం రావడంతో పాత పోస్టు కోసం ప్రయత్నాలు ముమ్మరం చేశారు. అనర్హుడైనా టీడీపీ ఎమ్మెల్యేల లేఖలతో ఆ పోస్టు దక్కించుకోవాలని చూస్తుండటంపై విమర్శలు వస్తున్నాయి.

నాటి అక్రమాలపై కొరడా

గతంలో జిల్లా విద్యాశాఖలో ఏఎస్ఓగా చక్రం తిప్పిన ఆ టీచర్ ఇప్పుడు మళ్లీ అదే పోస్టు కోసం ఆరాటపడుతున్నారు. ఐదేళ్ల కిందట ఓ టీచర్ ఏఎస్ఓగా పనిచేశారు. గతంలో ఉన్న డీఈఓ తాగుడు వ్యసనం, మతిమరుపును ఆసరాగా తీసుకుని తనకు కావాల్సిన టీచర్లను భారీగా డెప్యుటేషన్లు వేశారు. అప్పట్లో జిల్లావ్యాప్తంగా సుమారు 430 పైచిలుకు డెప్యుటేషన్లు వేస్తే అందులో ఆ పూర్వపు ఏఎస్ఓనే 'తనవారిని' వందలాది మందిని డెప్యుటేషన్లు వేశారన్న విమర్శలు అప్పట్లో బలంగా వినిపించాయి. ఒక్కో డెప్యుటేషన్‌కు టీచర్‌ను బట్టి రూ.30 వేల నుంచి ఆ పైచిలుకు డబ్బులు లాగాడన్న ఆరోపణలు వినిపించాయి. అయితే ఆ డీఈఓ వెళ్లిన తర్వాత వచ్చిన కొత్త డీఈఓ ఆ పూర్వపు ఏఎస్ఓ అక్రమాలపై నిఘా వేశారు. ఆయన అక్రమాలపై విచారణ చేయించిన ఆయన వెంటనే ఆయన్ను ఆపోస్టు నుంచి తప్పించారు. పనిష్మెంట్‌గా జిల్లా కేంద్రం నుంచి దూరంగా ఉన్న ప్రాంతంలో పోస్టింగ్ ఇచ్చారు. అయితే ఆ ఏఎస్ఓ అందులో కూడా చేరకుండా మళ్లీ పైరవీలు చేశారు.

తన సన్నిహితులను ఆశ్రయించి లక్షల రూపాయలు స్టేట్ ఆఫీసర్లకు సమర్పించి, అనంతపురం నగరానికి దగ్గర్లోని మరో స్కూల్‌కు ఆర్డర్ తెచ్చుకున్నారు. అయితే వైసీపీ అధికారం లోకి రావడంతో మళ్లీ ఇటువైపు చూడలేదు. ఈ ఐదేళ్లూ మౌనంగా ఉండిపోయారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో మళ్లీ ఏఎస్ఓ పోస్టుకు పైరవీలు మొదలెట్టాడు.

తాజాగా తహతహ...

మళ్లీ ఏఎస్ఓ పోస్టును ఎలాగైనా సొంతం చేసుకోవడానికి జిల్లాలోని కొందరు టీడీపీ ఎమ్మెల్యేల నుంచి లేఖలు తీసుకుని ఇటీవలే డీఈఓను కలిశారు. ఏఎస్ఓ పోస్టుకు విల్లింగ్ ఇస్తూ.. సిఫార్సు లేఖను అందించారు. ఆ పోస్టుకు నిబంధనల మేరకు మ్యాథ్స్ అసిస్టెంట్ మాత్రమే అర్హుడు. అయితే ఇంగ్లిష్ స్కూల్ అసిస్టెంట్ అయిన ఆయన నిబంధనలకు విరుద్ధంగా ఏఎస్ఓగా పనిచేయడానికి తహతహలాడుతున్నారు. గతంలో అడ్డగోలు డెప్యుటేషన్లతో పాటు ఎవరు ఫోన్ చేసినా స్పందించడన్న విమర్శలు ఆయనపై ఉన్నాయి. ఏఎస్ఓ పోస్టు అంటే నిత్యం ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓలు, రాష్ట్ర విద్యాశాఖ అధికారుల నుంచీ వచ్చే ఫోన్లకు సమాధానం ఇస్తుండాలి. అయితే ఆయన ఎవరు ఫోన్ చేసినా స్పందించరన్న ఆరోపణలు బలంగా ఉన్నాయి. దీనికితోడు అవినీతి మరకలున్నాయి. పైగా అనర్హుడు. ఆయన ఇప్పుడు మళ్లీ డీఈఓ కార్యాలయంలో అడుగుపెట్టడానికి ఆరాటపడుతున్నాడు. అన్నుడికి చెక్ పెడుతారో?లేక చేరదీస్తారో వేచి చూడాలి.

చట్టం అందరికీ ఒకేలా ఉండాలి

- మంత్రులపై కేసు నమోదు చేయాలి
- వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత
- అసభ్యకర పోస్టింగులపై ఫిర్యాదు




సీఐకి వివరిస్తున్న వైసీపీ నాయకులు

అనంతపురం క్రైం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): చట్టం అందరికీ ఒకేలా వర్తించాలనీ, కొందరికి చుట్టంగా మారుస్తామంటే ఉపేక్షించేది లేదని వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం వైసీపీ అధినేత జగన్, ఆయన కుటుంబ సభ్యులపై అసభ్యకరంగా సోషల్ మీడియాలో చేసిన పోస్టులపై అనంతపురం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో వైసీపీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో కలిసి ఫిర్యాదు చేశారు. నారా లోకేష్, వంగలపూడి అనిత, అచ్చెన్నాయుడు, అయ్యన్నపాత్రుడుకు చెందిన ఎక్స్(ట్విట్టర్)ఖాతాల నుంచి చేసిన పోస్టులను సీఐ శ్రీకాంత్‌కు అనంత వెంకటరామిరెడ్డి వివరించారు. సంబంధిత ట్వీట్లపై చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం అనంత వెంకటామిరెడ్డి మీడియాతో మాట్లాడారు. జగన్‌పై చేసిన మార్ఫింగ్ పోస్టులు తమ మనోభావాలు గాయపరిచేలా ఉన్నాయన్నారు. టీడీపీ నేతలపై కేసు రిజిస్టర్ చేసి చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. ఎవరిపైనైనా చర్యలు తీసుకుంటామని సీఎం చంద్రబాబు చెప్పారన్నారు. కేసు రిజిస్టర్ చేయకపోతే చట్టపరంగా ముందుకెళ్తామన్నారు. ప్రైవేట్ కేసులకు వెనుకాడేది లేదన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మాజీ ఎంపీ రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉంతకల్లు రిజర్వాయర్‌కు సీఎం అంగీకారం

ప్రభుత్వ విప్ కాలవ వెల్లడి



సీఎం చంద్రబాబుకు ఉంతకల్లు రిజర్వాయర్‌పై వివరిస్తున్న కాలవ

బొమ్మనహాళ్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర ఎగువ కాలువకు అనుసంధానంగా బొమ్మనహాళ్ మండలం ఉంతకల్లు వద్ద నిర్మించతలపెట్టిన ప్రతిపాదిత రిజర్వాయర్ సమగ్ర నివేదిక తయారీ నిధుల విడుదలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అంగీకరించినట్లు ప్రభుత్వ విప్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఆయన సమర్పించిన వినతిపై నిధుల విడుదలకు ఉత్వర్వులు ఇచ్చినట్లు కాలవ శ్రీనివాసులు తెలిపారు. హెచ్‌ఎల్సీ నీటిని ఉంతకల్లు వద్ద నిలువ చేసుకుంటే జిల్లాలో ఎక్కడ, ఎప్పుడు నీటి అవసరమొచ్చినా వినియోగించుకునే వెసులు బాటు కలుగుతుందన్నారు. ఉంతకల్లు, నేమకల్లు గ్రామాల మధ్య సుమారు 5 టీఎంసీల సామర్థ్యంతో బ్యాలెన్సింగ్ రిజర్వాయరు నిర్మాణానికి గతంలో తాను మంత్రిగా ఉన్నప్పుడు ప్రతిపాదించానని పేర్కొన్నారు. దీని సాధ్యసాధ్యాలపై డీపీఆర్ తయారు చేయాలని 2018 అక్టోబర్ 31న అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం జీఓ విడుదల చేసిందని చెప్పారు. నివేదిక రూపొందిస్తున్న సంస్థకు చెల్లించాల్సిన రూ. 2.80 కోట్లు నిధులను గత వైసీపీ ప్రభుత్వం విడుదల చేయలేదని తెలిపారు. ఫలితంగా డీపీఆర్ సిద్ధం కాలేదన్నారు. గతంలో ముఖ్యమంత్రి హోదాలో జగన్మోహన్‌రెడ్డి రాయదుర్గం పర్యటనలో ఉంతకల్లు రిజర్వాయరు నిర్మాణానికి హామీ ఇచ్చినా, అడుగు ముందుకు పడలేదన్నారు. కనీసం డీపీఆర్ తయారీకి కూడా నిధులివ్వలేదని అన్నారు. ఈ నేపథ్యంలో తాను ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఉంతకల్లు రిజర్వాయరు అవసరాన్ని వివరించానన్నారు. దీంతో డీపీఆర్ తయారీకి అంగీకరించి, అందుకు అవసరమయ్యే నిధుల విడుదలకు సమ్మతించారని కాలవ శ్రీనివాసులు తెలిపారు.

తుంగభద్ర డ్యాం క్రస్ట్‌గేట్ల మార్పు తప్పనిసరి



టీబీ డ్యాం వద్ద సమావేశంలో పాల్గొన్న అధికారులు

- బోర్డు సమావేశంలో సుదీర్ఘ చర్చ
- నౌలి ప్రాజెక్ట్ ప్రతిపాదనపై అభ్యంతరం
- ఖాతాల ఫ్రీజ్‌తో వేతనాలకు ఇబ్బందులు

రాయదుర్గం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర జలాశయానికి సంబంధించిన 33 క్రస్ట్‌గేట్లను తప్పనిసరిగా మార్చాలని బోర్డు తీర్మానించింది. క్రస్ట్ గేట్ల సామర్థ్యంపై జాతీయస్థాయి కంపెనీలతో సమగ్ర తనిఖీలు నిర్వహించి ప్రతిపాదనలను సిద్ధం చేసేందుకు బోర్డు సమావేశం నిర్ణయించింది. శుక్రవారం హోస్పేట్‌లో తుంగభద్ర బోర్డు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు సుదీర్ఘంగా చర్చించారు. జాతీయ స్థాయిలో పేరుపొందిన కలైపుడి, జంషెడ్‌పూర్ కంపెనీలను ఇప్పటికే క్రస్ట్ గేట్ల సామర్థ్యం గురించి ఒక్కొక్కటిగా తనిఖీలు నిర్వహించి నివేదిక ఇవ్వాలని కోరామన్నారు. దీనికి సంబంధించి జనవరి చివరికల్లా విధివిధానాలు పూర్తిచేసి బిడ్స్‌ను పిలిచి సమగ్రంగా ప్రక్రియను పూర్తి చేయాల్సిందిగా నిర్ణయించారు. డిసెంబర్ 7న ఎన్‌డీఎస్‌ఏ చైర్మన్ జైన్ కూడా డ్యాంను సందర్శించున్నారని, ఈ నేపథ్యంలో డ్యాం సేఫ్టీకి సంబంధించి పూర్తిస్థాయి నివేదిక అందుతుందన్నారు. డ్యాం క్రస్ట్ గేట్లను మార్పు చేసేందుకు తక్కువ బిడ్ దాఖలు చేసిన వారికే టెండరు ప్రక్రియను అప్పగించాలని నిర్ణయించారు. ఈనెల 25న వీడియో కాన్ఫరెన్స్ ద్వారా క్రస్ట్ గేట్లను పరిశీలించేందుకు జాతీయస్థాయి కంపెనీలు నిర్ణయించినట్లు అధికారులు వెల్లడించారు. అదే విధంగా కర్ణాటక ప్రభుత్వం నౌలి రిజర్వాయర్‌ను నిర్మించేందుకు బోర్డు అనుమతిని కోరింది. అందుకు ఆంధ్ర ప్రతినిధిగా హాజరైన సీఈ నాగరాజు అభ్యంతరం వ్యక్తం చేశారు. సమాంతర కాలువ ప్రతిపాదన కూడా బోర్డు ముందు ఉందని, దానిపై నిర్ణయం తీసుకునేదాకా నౌలికి ఆమోదం తెలిపేది లేదని స్పష్టం చేశారు. సమాంతర కాలువ, నౌలి రిజర్వాయర్ నిర్మాణానికి సంబంధించి ఆయా రాష్ట్రాలు ఏకాభిప్రాయానికి రావాల్సి ఉందన్నారు. రాష్ట్రాల ఏకాభిప్రాయం వచ్చేదాకా దీని గురించి ప్రస్తావించబోమని స్పష్టం చేశారు. బోర్డుకు సంబంధించి ఖాతాలను ఫ్రీజ్ చేయడంతో సిబ్బందికి వేతనాలు కూడా చెల్లించలేని పరిస్థితి ఉందన్నారు. పనుల్లో ఏమైనా తప్పిదాలు జరిగి ఉంటే బిల్లుల వరకు చెల్లింపులు నిలిపి వేస్తే బాగుంటుందని, వేతనాలు వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్రాలకు బోర్డు కోరింది. సమావేశంలో బోర్డు కార్యదర్శి ఓఆర్‌కే రెడ్డి, ఇన్‌చార్జ్ ఎస్ఈ నీలకంఠారెడ్డి, సీఈ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఊయలలో ఊపిరి ఆడకే

చిన్నారి మృతి..!

పోస్టుమార్టం నివేదికలో వెల్లడి

6లో

సూసైడ్ నోట్‌లో ఏముందో?

కృష్ణకిశోర్ దంపతుల సూసైడ్ నోట్‌ను బయటపెట్టని పోలీసులు

ప్రశాంతి నిలయంలో భక్తుల సందడి







ప్రసంగిస్తున్న సేతురామన్



సేతురామన్‌ను సత్కరిస్తున్న ఆర్‌జే రత్నాకర్







విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేస్తున్న యూఎస్ నేషనల్ సైన్స్ ఫౌండేషన్ డైరెక్టర్ సేతురామన్ పంచనాథన్, యూనివర్సిటీ చాన్సిలర్ చక్రవర్తి

అతిథులకు విద్యార్థుల స్వాగతం



సర్వం సిద్ధం

నేడు సత్యసాయి 99వ జయంత్యుత్సవం

- దేశవిదేశాల నుంచి వచ్చిన భక్తులు
- ముఖ్యఅతిథిగా గవర్నర్ అబ్దుల్ నజీర్
- పోలీస్ వలయంలో పుట్టపర్తి

పుట్టపర్తి, నవంబరు22(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రం పుట్టపర్తి సత్యసాయి జయంత్యుత్సవాలకు ముస్తాబైంది. సత్యసాయి బాబా 99వ జయంతి వేడుకలకు దేశవిదేశాల నుంచి భక్తులు పుట్టపర్తికి రావడంతో సందడి నెలకొంది. సత్యసాయి 99వ జయంతి వేడుకలకు వేదికైన సత్యసాయి సన్నిధి సాయికుల్వంత్ మందిరాన్ని దేదీప్యమానంగా తీర్చిదిద్దారు. పుట్టపర్తి పురవీధుల్లో తోరణాలు, విద్యుత్ కాంతులతో అలంకరించారు. సాయికుల్వంత్ మందిరంలో సత్యసాయి మహాసమాధి చెంత జయంతి వేడుకలు శనివారం ఉదయం 8 గంటలకు ప్రారంభమైతాయి. 9.10కి సత్యసాయి ట్రస్టు వార్షిక నివేదిక విడుదల చేస్తారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ హాజరుకానున్నారు. సాయంత్రం స్వర్ణ రథంపై సత్యసాయి చిత్రపటం ఊరేగిస్తారు.

పుట్టపర్తిలో సందడి

సత్యసాయి 99వ జయంత్యుత్సవాలను తిలకించేందుకు ప్రముఖులతోపాటు దేశవిదేశాల భక్తులు తరలివచ్చారు. ప్రశాంతి నిలయంతోపాటు పట్టణంలోని వీధులు ఇప్పటికే భక్తులతో కిటకిటలాడుతున్నాయి. ప్రశాంతి నిలయంలో ఎటుచూచిన జనమే కన్పిస్తున్నారు. సత్యసాయి మహాసమాధిని భక్తులు పెద్ద సంఖ్యలో సందర్శించారు. పుట్టపర్తి వీధుల్లో భక్తులు సందడి కల్పించింది. పుట్టపర్తికి రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌తోపాటు ప్రముఖులు, దేశ విదేశాల భక్తులు రానున్న నేపథ్యంలో జిల్లా పోలీస్ యంత్రాంగం భారీ భద్రతా ఏర్పాట్లు చేసింది. పుట్టపర్తికి వచ్చే ప్రధాన రహదారులతోపాటు ప్రశాంతి నిలయంలో దారి పొడవునా పోలీసులు కన్పిస్తున్నారు. జయంతి వేడుకల్లో పాల్గొనే భక్తులు, ప్రజలకు తాగునీరు, వైద్యసేవలు, వాహనాల పార్కింగ్, తాత్కాలిక వసతి, సమాచారకేంద్రాలను అధికారయంత్రాంగం ఏర్పాటు చేసింది.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు: శుక్రవారం సాయంత్రం సాయికుల్వంత్ సభామండపంలో సత్యసాయి హయ్యర్ సెకండరీ విద్యార్థులు సంగీత సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సత్యసాయి ఆధ్యాత్మికత సేవలు, బోధనలపై చేపట్టిన నాటిక భక్తులను అలరింపచేసింది. సాయికుల్వంత్‌లో ప్రత్యేక దీపాలంకరణ చేశారు.

నేడు జయంతి వేడుకలు: శ్రీసత్యసాయిబాబా 99వ జయంతి వేడుకలు ప్రశాంతినిలయంలోని సాయికుల్వంత్‌లోని సభామండపంలో శనివారం నిర్వహిస్తారు. ఇందు కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. వేడుకలలో పాల్గొనడానికి వేలాది మంది భక్తులు తరలివచ్చారు.



సాయి విద్యావిధానం... ఆదర్శం

శ్రీసత్యసాయి వర్సిటీ స్నాతకోత్సవంలో వక్తలు

విద్యార్థులకు బంగారు పతకాల పంపిణీ

అట్టహాసంగా వేడుకలు

పుట్టపర్తి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): వ్యక్తిత్వ వికాసం, మానవత్వం, సామాజిక స్పృహతో కూడిన సత్యసాయి విద్యావిధానం ప్రపంచంలోనే అందరికి ఆదర్శమని యూఎస్ నేషనల్ సైన్స్ ఫౌండేషన్ డైరెక్టర్ సేతురామన్ పంచనాథన్ కొనియాడారు. శుక్రవారం ప్రశాంతి నిలయంలోని పూర్ణచంద్రహాల్‌లో శ్రీసత్యసాయి యూనివర్సిటీ 43వ స్నాతకోత్సవాలు ఘనంగా నిర్వహించారు. మొదట ముఖ్యఅతిథులు, వీసీ, అధ్యాపకులను విద్యార్థులు మంగళవాయిద్యాలతో వేదిక వద్దకు తీసుకొచ్చారు. విద్యార్థులు వేద పఠనంతో ఈ వేడుకలు ప్రారంభమయ్యాయి. సేతురామన్ పంచనాథన్ మాట్లాడుతూ... సత్యసాయి విద్యావిధానంతో విద్యార్థులు సంపూర్ణ వ్యక్తిత్వ వికాసంతో బయటకు వస్తున్నారన్నారు. ప్రపంచంలో పలు యూనివర్సిటీలు సందర్శించానని, ఇటువంటి విలువలతో కూడిన విద్యావిధానాన్ని ఎక్కడా చూడలేదన్నారు. సత్యసాయి విద్యార్థులుగా సత్యసాయి బోధనలు, ఆధ్యాత్మికతను ప్రచారం చేయాలని కాంక్షించారు. అనంతరం సేతురామన్‌ను సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ సన్మానించారు.

21 మందికి బంగారు పతకాలు

సత్యసాయి యూనివర్సిటీలో ఉత్తమ ఫలితాలు సాధించిన 21 మంది విద్యార్థులకు ముఖ్యఅతిథి సేతురామన్, యూనివర్సిటీ చాన్సిలర్ చక్రవర్తి బంగారు పతకాలు అందజేశారు. మరో 14 మందికి పీహెచ్‌డీలను ప్రదానం చేశారు. 463 మంది విద్యార్థులకు డిగ్రీ పట్టాలు అందజేశారు. స్నాతకోత్సవంలో సత్యసాయి యూనివర్సిటీ పరిధిలోని ప్రశాంతి నిలయం క్యాంపస్, అనంతపురం మహిళా క్యాంపస్, బెంగళూర్‌లోని బృందావనం, చిక్‌బళాపురంలోని ముద్దనహళ్లి క్యాంపస్ విద్యార్థులు పాల్గొన్నారు.

పాల్గొన్న ప్రముఖులు

స్నాతకోత్సవంలో వీసీ రాఘవేంద్రప్రసాద్, ట్రస్టు సభ్యులు డాక్టర్ మోహన్, నాగానందం, మాజీ మంత్రి పల్లెరఘునాథరెడ్డి, సేవాసంస్థల ప్రతినిదులు నిమీష్‌పాండే, చీర, కోటేశ్వరరావు, దేశవిదేశాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఈతకు వెళ్లి విద్యార్థి మృతి





చరణ్ మృతదేహం, ఆస్పత్రిలో విలపిస్తున్న తల్లిదండ్రులు

గుంతకల్లుటౌన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ఈతకు వెళ్లిన విద్యార్థి మృతి చెందడంతో ఆ కుటుంబం శోకసముద్రంలో మునిగిపోయింది. మండలంలోని నెలగొండ గ్రామానికి చెందిన గోవిందు, శకుంతల దంపతులకు చరణ్, ఒక కూతురు ఉన్నారు. చరణ్(14) గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. తండ్రి గోవిందు ఉపసర్పంచుగా కొనసాగుతున్నాడు. అతడు వ్యవసాయం, కూలీ పనులు చేసుకొని జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం చరణ్ స్కూల్‌కు వెళ్లలేదు. గోవిందు అన్న కొడుకులు చెన్నకేశవులు, సింహాద్రి, చిన్న గొర్రెలు మేపడానికి గ్రామ శివారులోని చెక్‌డ్యాం వద్దకు వెళ్లారు. సెల్‌ఫోన్‌లో గేమ్ ఆడడానికి చరణ్ కూడా మధ్యాహ్నం అక్కడికి వెళ్లాడు. చెక్‌డ్యాంలో కాసేపు ఈత కొట్టాడు. మధ్యలోకి వెళ్లొద్దు లోతు ఎక్కువగా ఉందని చెన్నకేశవులు వారించి భోజనం చేసేందుకు వెళ్లాడు. తనకు ఈత వచ్చు అని చెప్పి చరణ్ మధ్యలోకి వెళ్లాడు. భోజనం చేసి వచ్చేసరికి చరణ్ కనిపించలేదు. దీంతో చుట్టు పక్కల పొలాల్లో ఉన్న వారిని పిలిచాడు. సుమారు గంటన్నరపాటు నీటిలో వెతకగా చరణ్ దొరికాడు. వెంటనే చికిత్స నిమిత్తం గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అతడు అప్పటికే మృతి చెందాడన్నారు. విషయం తెలుసుకున్న పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయలు, గ్రామస్థులు ప్రభుత్వా ఆసుపత్రికి చేరుకున్నారు. చరణ్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సంఘటనపై రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. చరణ్ నిద్రపోతున్నాడని, తాను పిలిస్తే లేస్తాడని తల్లి శకుంతల కొడుకు మృతదేహం పడి రోధించిన తీరు అందరిని కలచివేసింది. చరణ్ లే ఇంటికి పోదామంటూ ఆమె విలపించింది.

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య

చెన్నేకొత్తపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దామాజిపల్లి సమీపంలో రైలు కిందపడి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. హిందూపురం రైల్వేపోలీసు హెడ్‌కానిస్టేబుల్ ఎర్రిస్వామి తెలిపిన మేరకు రామగిరి మండలం పోలేపల్లి గ్రామానికి చెందిన మురళి(32) కియా కార్ల కంపెనీలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈక్రమంలో భార్యతో గొడవపడి ఇంటి నుంచి బయటకు వచ్చి క్షణికావేశంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే కీమ్యాన్, లోకోపైలెట్ ఇచ్చిన సమాచారం మేరకు హెడ్‌కానిస్టేబుల్ ఎర్రిస్వామి ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఘటనా స్థలం వద్ద బ్యాగులో ఉన్న ఆధార్‌కార్డు ఆధారంగా మృతుడి వివరాలు తెలుసుకుని కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. కుటుంబసభ్యులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించిన అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మురళికి భార్య అంబిక, కుమార్తె, కుమారుడు ఉన్నారు. హిందూపురం రైల్వేపోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

గల్ఫ్ దేశాలకు అనంత అరటి

బనానా రైలును వర్చువల్‌గా ప్రారంభించిన ప్రిన్సిపల్ సెక్రటరీ.. హాజరైన ఎంపీ, కలెక్టర్ హాజరు



జెండా ఊపి రైలును ప్రారంభిస్తున్న ఎంపీ, మున్సిపల్ చైర్మన్, కలెక్టర్, అధికారులు

తాడిపత్రి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా అరటి గల్ఫ్‌దేశాలకు ఎగుమతి అవుతోంది. ఈ సందర్భంగా శుక్రవారం తాడిపత్రి రైల్వేస్టేషన్‌లో ముంబై వరకు బనానా రైలును ప్రిన్సిపల్ సెక్రటరీ రాజశేఖర్, గుంటూరు సిరికల్చర్ డైరెక్టర్ శ్రీనివాసులు వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా తాడిపత్రి రైల్వేస్టేషన్‌లో బనానా రైలును ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, కలెక్టర్ వినోద్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. అంతకు ముందు ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ అనంతపురం జిల్లా అరటి ఉత్పత్తులు అంతర్జాతీయ స్థాయికి చేరడం శుభపరిణామన్నారు. ముంబై నుంచి షిప్‌ద్వారా ఇరాక్ దేశానికి వెళ్లడం ఈ అరటికి ఎంత గిరాకీ ఉందో అర్థమవుతోందన్నారు. ప్రిన్సిపల్ సెక్రటరీ మాట్లాడుతూ 2003లో అనంతపురం జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన సమయంలో కరువు బారి నుంచి జిల్లాను కాపాడడానికి ప్రణాళికలు అమలు చేసేవారమని గుర్తు చేసుకున్నారు. జిల్లాను ఫ్రూట్స్ హబ్‌గా మార్చిన అధికారులు, ప్రజాప్రతినిధులకు అభినందనలు తెలిపారు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ జిల్లా అరటిని ప్రపంచంలో అగ్రగ్రామిగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పని చేస్తున్నారని తెలిపారు. 2016లోనే ముఖ్యమంత్రి చంద్రబాబు దూరదృష్టితో ఆలోచించి రైతులకు అనేక సదుపాయాలు కల్పించారన్నారు. లక్ష టన్నులకు ఎగుమతులు చేసేస్థాయికి జిల్లా చేరుకోవడం సీఎం ముందు చూపుతోనే సాధ్యమైందన్నారు. మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో అరటి, దానిమ్మ, చీనీ, సపోటా, బొప్పాయి పండ్లతోటలకు ప్రసిద్ధిగాంచిందన్నారు. ఒకప్పుడు రాయలసీమ అంటే రాళ్లసీమ అనేవారని ప్రస్తుతం పంటలు పండించుకుంటూ రతనాల సీమగా తయారైందని సంతోషం వ్యక్తం చేశారు. కలెక్టర్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాను వివిధ ఉద్యానవన పంటల ఉత్పత్తికి కేంద్రంగా పరిగణించవచ్చన్నారు. జిల్లాకు ప్రత్యేక వాతావరణ పరిస్థితులు, సామర్థ్యాలు ఉన్నాయని, ఇవి ఏడాది పొడవునా సాగుకు అనుకూలంగా ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో న్యూఢిల్లీ ఏపీఈడీఏ జనరల్ మేనేజర్ వినీతసుధన్షు, హైదరాబాద్ కంటైనర్ కార్పొరేషన్ సీనియర్ జనరల్ చెక్ మేనేజర్ అనిత బారిక్, జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ, శ్రీకృష్ణ ఇంపెక్స్ వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ అనిష అగర్వాల్, ఆర్డీఓ కేశవనాయుడు, హార్టికల్చర్ డీడీ నరసింహారావు, జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ, మార్కెటింగ్ ఏడీ సత్యనారాయయణచౌదరి, ఎస్‌బీసీ డీఐఓ రవిశంకర్, ఏపీ ఎంఐపీ పీడీ రఘునాథరెడ్డి, ఏడీ ఫిరోజ్ ఖాన్, రైల్వేస్టేషన్ మాస్టర్ అనిల్ ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

రేపు కార్తీక వనభోజన మహోత్సవం

రాప్తాడు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): అఖిల భారత కాకతీయ ఉమ్మడి అనంతపురం జిల్లా ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కార్తీక వనభోజన మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం నాయకులు తెలిపారు. రాప్తాడు మండలం హంపాపురం వద్ద 44వ జాతీయ రహదారి పక్కన నాగేశు వ్యవసాయ క్షేత్రంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సంఘం కుటుంబ సభ్యులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధ దంపతుల దుర్మరణం

ముదిగుబ్బ, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని పట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం రాత్రి రోడ్డు ప్రమాదంలో నాగారెడ్డిపల్లికి చెందిన దంపతులు గంగన్న (80), నరసమ్మ (75) మరణించారు. వీరు మలకవేములక్రాస్‌కు వచ్చారు. తిరిగి ఆటోలో స్వగ్రామానికి వెళ్లేందుకు నాగారెడ్డిపల్లి క్రాస్ వద్ద దిగారు. రోడ్డు దాటుతుండగా ముదిగుబ్బ వైపు నుంచి కదిరి వైపు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ప్రమాదంలో వారిద్దరూ అక్కడికక్కడే మరణించారు. వీరికి ముగ్గురు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పట్నం ఎస్‌ఐ రాజశేఖర్ తెలిపారు.

ప్యాసింజరు రైళ్ల నంబర్ల మార్పు

గుంతకల్లు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): గుంతకల్లు రైల్వే డివిజన్‌కు చెందిన పలు ప్యాసింజరు రైళ్ల నెంబర్లను మార్పు చేసినట్లు అధికారులు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మార్పు జనవరి 1వ తేదీ నుంచి అమలులోకి వస్తున్నందన్నారు. వివిధ రైళ్ల మారిన నెంబర్లు ఇలా ఉన్నాయి.

ప్యాసింజరు రైలు	పాత నంబరు	కొత్త నంబరు
గుంతకల్లు-డోన్	07288	77203
డోన్-గుత్తి-డోన్	07289/90	77205/06
కర్నూలుసిటీ-గుంతకల్లు	07292	77204
గుంతకల్లు-హిందూపురం-గుంతకల్లు	07693/94	77213/14
గుంతకల్లు-రాయచూరు-గుంతకల్లు	07799/800	77201/02

ఊయలలో ఊపిరి ఆడకే

పోస్టుమార్టం నివేదికలో వెల్లడి

చిన్నారి మృతి..!



ప్రాణాలు వదిలిన ఐదునెలల పసికూన(ఫైల్)

అనంతపురం టౌన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఊయలలో ఊపిరి ఆడకపోవడంతో పసిబిడ్డ మృతి చెందే అవకాశం ఉన్నట్లు జిల్లా సర్వజనాస్పత్రి వైద్యులు వెల్లడించారు. రెండు రోజుల కిందట నార్పలలో ఓఆర్యవైశ్య కుటుంబం అప్పులు బాధ తాళలేక ఆత్యహత్య చేసుకున్న విషయం తెలిసిందే. ఈ సమయంలో వారి ఐదు నెలల కుమారుడు కూడా చనిపోయాడు. అయితే ఆ పసిబిడ్డ మరణంపై రకరకాల వాదనలు వెలువడ్డాయి. పసిబిడ్డను ముందుగానే చంపి వారు ఆత్మహత్య చేసుకున్నారా? లేక పాప ఊయలలో పడుకున్న సమయంలో వారు ఆత్యహత్య చేసుకున్నారా? అని రకరకాల ప్రశ్నలు తలెత్తాయి. పోలీసులు సైతం పసి బిడ్డను తల్లిదండ్రులు చంపలేదని, అలాంటి ఆనవాళ్లు కనిపించలేదని మృతదేహాన్ని పరిశీలించినప్పుడే పోలీసులు నిర్ధారణకు వచ్చారు. పోస్టుమార్టమ్ నిర్వహించిన జిల్లా సర్వజన ఆస్పత్రి ఫోరెన్సిక్ డాక్టర్లు ఆ పసిబిడ్డను ఎవరు చంపలేదని నిర్ధారించారు. తల్లిదండ్రులు ముందుగానే ఇంట్లో ఉన్న ఊయలలో ఆ పసిబిడ్డను బోర్లా పడుకోబెట్టారని, దీని వల్ల ఊపిరి ఆడక మరణించి ఉండే అవకాశం ఉందన్నారు. నెలల చిన్నారిని ఇలా ఊయలలో బోర్లా పడుకోబెడితే పక్కకు తిరగలేదని, అలాంటపుడు ఊపిరి ఆడక మూడు నుంచి ఐదు నిమిషాలలోనే పసిపిల్లలు చనిపోతారని ఫోరెన్సిక్ విభాగం హెచ్‌ఓడీ డాక్టరు శంకర్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. దీనిని వైద్య పరిభాషలో సఫోకేషన్ అని అంటారని ఆయన అన్నారు. నార్పల ఘటనలో కూడా ఇదేజరిగి ఉండవచ్చని, దీని వల్లే పసిబిడ్డ చనిపోయిందని వెల్లడించారు.

సూసైడ్ నోట్‌లో ఏముందో?

కృష్ణకిషోర్ దంపతుల సూసైడ్ నోట్‌ను బయటపెట్టని పోలీసులు

నార్పల, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో కృష్ణకిషోర్, శిరీష దంపతుల ఆత్మహత్యపై భిన్న కథనాలు వినపడుతున్నాయి. కృష్ణకిషోర్ కుటుంబం ఆత్మహత్య చేసుకునే ముందు అప్పుల గురించి సూసైడ్ నోట్ రాసినట్లు సమాచారం. ఆ నోట్‌ను పోలీసులు తీసుకుని, బయటికి విడుదల చేయలేదు. అయితే ఆ సూసైడ్ నోట్‌లో కృష్ణకిషర్ అప్పుల మొత్తం ఎంత ఉంది? అప్పులు చెల్లించాలని ఎవరూ వేధిస్తున్నారు? తన బంధువులు కుటుంబికుల మధ్య ఉన్న విభేదాలు తదితర వాటిపై అందులో ఏమైనా రాశాడా? అన్న విషయాలు చర్చనీయాంశంగా మారాయి. సూసైడ్ నోట్ గురించి నార్పల ఎస్‌ఐ సాగర్‌ను అడగగా నోట్ రాసింది నిజమేనని, అందులో ఏమి లేదని తెలిపారు.

ముగ్గురి మృతదేహాలకు అంత్యక్రియలు పూర్తి

కృష్ణకిషోర్, శిరీష, వారి బాబుకు అనంతపురంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి అనంతపురంలోనే అంత్యక్రియలను పూర్తి చేశారు. ఈ అంత్యక్రియలకు కృష్ణకిషోర్ అన్న రమేష్, మృతురాలి అక్కతో పాటు మరో పది మంది బంధువులు మాత్రమే హాజరుకావడం గమనార్హం. అయితే 20ఏళ్ల నుంచి తన తమ్ముడు కృష్ణకిషోర్‌తో ఆస్తి విషయంలో మాటలు లేవని పోలీసుల ఎదుట మృతుడి అన్న రమేష్ తెలిపాడు. దాదాపు రూ. 50లక్షలు వరకు అప్పులు ఇచ్చిన వారు ఎవరూ కూడా ఎవరూ అటువైపు కన్నెత్తి చూడలేదు.

పాప కాదు.. బాబు

కృష్ణకిషోర్, శిరీష దంపతులు ఆత్మహత్య చేసుకోవడంతో ఊయలలో చనిపోయిన బిడ్డ పాపేనని తొలుత అందరూ భావించారు. బంధువులు కూడా పాపా, లేక బాబా అనే విషయంలో స్పష్టత ఇవ్వలేదు. మృతి చెంది దాదాపు నాలుగు రోజులు కావడంతో మృతదేహాలు గుర్తించలేని స్థితిలో ఉండటంతో చనిపోయింది పాపే అని అందరూ అనుకున్నారు. పోలీసులు అలాగే భావించి వివరాలు వెల్లడించారు. అయితే మృతదేహాలను ఆస్పత్రికి తరలించిన తర్వాత అసలు విషయం తెలిసింది. చనిపోయింది పాప కాదు బాబు అని వెల్లడైంది.

పట్టు జారుతోంది..!

తిరోగమనంలో మల్బరీ సాగు
సిబ్బందిలేమితో
కొట్టుమిట్టాడుతున్న శాఖ
వీఎస్‌ఏలను తీసుకుంటే
కొరత తీరే అవకాశం



అనంతపురం సెంట్రల్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు కరువు పరిస్థితుల నుంచి గట్టెక్కించిన పట్టుపరిశ్రమ కొన్ని సంవత్సరాలుగా తిరోగమన బాటపట్టింది. వ్యవసాయ ఆధారిత ప్రాంతమైన ఉమ్మడి జిల్లాను తీవ్ర వర్షాభావం, కరవు తాండవం ఆవహించిన సమయంలో రైతులను ఆదుకుని సిరులు కురిపించింది. తక్కువ నీటి వాడకం, కొద్దిపాటి పెట్టుబడితో ఎక్కువ దిగుబడిని అందించే ఏకైక వ్యవసాయం మల్బరీ పంటసాగు. రైతులను ప్రోత్సహించేలా మొక్కలు నాటే ప్రక్రియ నుంచి పట్టుగూళ్ల మార్కెట్‌లో అమ్మేవరకు దశలవారిగా ప్రభుత్వం రాయితీలను అందిస్తోంది. ఇంటిల్లిపాది శ్రమిస్తే చాలు మూడు వారాల్లో పట్టుగూళ్ల రూపంలో మేలైన దిగుబడిని పొందవచ్చు. పట్టుపరిశ్రమ శాఖలో సరిపడా సిబ్బంది లేకపోవడంతో పరిస్థితి దినదిన గండంగా తయారైంది. వాతావరణ పరిస్థితులు, పంట తెగుళ్లు, పట్టుగూళ్ల తదితర వాటిపై అవగాహన కల్పించేవారు కరువయ్యారు. మరోవైపు ప్రభుత్వం అందించే ప్రోత్సాహాలను వివరించి, కొత్త రైతులను మల్బరీ సాగు వైపు ఆకర్షించలేకపోతున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో రూ.కోట్లలో రాయితీలు బకాయి పడ్డాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపు 25వేల ఎకరాల్లో మల్బరీ పంటసాగవుతోంది. 70వేల ఎకరాల వరకు మల్బరీ సాగుచేయడానికి వాతావరణ పరిస్థితులు సహకరిస్తున్నాయి. శెట్టూరు, కుందుర్పి, కంబదూరు, రాయదుర్గం, కళ్యాణదుర్గం, మడకశిర, అమరాపురం, హిందూపురం, లేపాక్షి, కదిరి తదితర ప్రాంతాలన్నీ గతంలో సిరికల్చర్‌తో సిరులు కురిపించినవే. ప్రభుత్వాలు దృష్టి పెట్టకపోవడంతో గత కొన్నేళ్లుగా మల్బరీ సాగు బాగా తగ్గిపోయిందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

వెంటాడుతున్న సిబ్బందిలేమి

ఉమ్మడి జిల్లాలో అనంతపురం, కళ్యాణదుర్గం, పెనుకొండ, ధర్మవరం, హిందూపురం, కదిరి, మడకశిర ప్రాంతాలను పట్టుపరిశ్రమశాఖ డివిజన్లుగా విభజించింది. ఒక్కో డివిజన్ పరిధిలో అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ), సిరికల్చర్ ఆఫీసర్ (ఎస్‌ఓ), అసిస్టెంట్ సిరికల్చర్ ఆఫీసర్(ఏఎస్‌ఓ), టెక్నికల్ ఆఫీసర్ (టీఓ), టెక్నికల్ అసిస్టెంట్స్ (టీఏ), ఫీల్డ్ అసిస్టెంట్స్(ఎఫ్‌ఏ) ఉంటారు. మొత్తం ఏడు డివిజన్లకు గాను అన్ని క్యాడర్లు కలిపి 300 మంది కూడాలేరు. యూనిట్ల సంఖ్యను బట్టి ఒక్కో డివిజన్‌కు కనీసం 300 మంది ఉండాలని అధికార వర్గాలు చెబుతున్నాయి. సిబ్బంది కొరత నేపథ్యంలో కనీసం 30వేల ఎకరాల్లో కూడా మల్బరీ సాగు చేయించలేకపోతున్నట్లు తెలుస్తోంది. గ్రామ, వార్డు సచివాలయాల పోస్టుల భర్తీకోసం నిర్వహించిన సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా 450 మంది విలేజ్ సెరికల్చర్ అసిస్టెంట్స్ (వీఎస్‌ఏ)ను నియమించారు. వీరిలో ఉమ్మడి జిల్లాలోనే 150 మంది వీఎస్‌ఏలున్నారు. వీరందరూ రైతుసేవా కేంద్రాల ద్వారా అగ్రికల్చర్, హార్టికల్చర్ శాఖలకు సేవలందిస్తున్నారు. సిరికల్చర్‌లో డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీలు చేసిన వీఎస్‌ఏలను ఇతర శాఖల్లో పనిచేయించడం ద్వారా పట్టుపరిశ్రమశాఖ నష్టపోతుందని ఆ శాఖ అధికారుల వర్గాలు ఆందోళన వ్యక్తంచేస్తున్నాయి. వీఎస్‌ఏలను తీసుకుంటే ఆశించిన స్థాయిలో మల్బరీ సాగు పెంచవచ్చని ఆ శాఖ వర్గాలు అంటున్నాయి.

ప్రోత్సహిస్తే పూర్వవైభవం

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పట్టుపరిశ్రమ శాఖ పూర్తిగా నిర్వీర్యమైపోయింది. రైతులకు రావాల్సిన సబ్సిడీలు రూ.కోట్లలో బకాయి ఉంది. కూటమి ప్రభుత్వం ప్రోత్సహిస్తే మల్బరీ సాగు పుంజుకుంటుందని ఆ శాఖ వర్గాలు అంటున్నాయి. గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు డ్రిప్ ఇరిగేషన్‌కు అధిక ప్రాధాన్యం ఇచ్చారు. 90శాతం వరకు సబ్సిడీని అందించి విరివిగా డ్రిప్ ప్రక్రియను వినియోగంలోకి తీసుకువచ్చారు. ఇది మల్బరీ సాగు పెరగడానికి బాగా ఉపయోగపడింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం చొరవ తీసుకుని రైతులకు రాయితీలు ఇస్తే సాగు పెరిగి పూర్వవైభవం వస్తుందని ఆ శాఖ అధికారులు అభిప్రాయపడుతున్నారు. వీఎస్‌ఏలను పట్టుపరిశ్రమ శాఖకు అనుసంధానం చేసుకుని క్షేత్రస్థాయిలో విధులు కేటాయించాలని అధికార వర్గాలు సూచిస్తున్నాయి.

ప్రభుత్వం చేతుల్లో ఉంది...



వీఎస్‌ఏలను పట్టుపరిశ్రమ శాఖలోకి తీసుకునే అంశం ప్రభుత్వం చేతుల్లో ఉంది. ఉమ్మడి జిల్లాలో మల్బరీ సాగుకు అనుకూలమైన వాతావరణం పుష్కలంగా ఉంది. మల్బరీ సాగును పెంచాలంటే క్షేత్రస్థాయిలో రైతుల వద్దకెళ్లి అవగాహన కల్పించాలి. అందుకు తగిన సిబ్బంది లేకపోవడంతో ఉన్న వారికే ఎక్కు ప్రాంతాన్ని కేటాయించి రైతుల వద్దకు పంపుతున్నాం. ఇప్పటికే 80 శాతం వరకు ఉద్యోగులు రిటైర్డ్ అయిపోయారు. ఈ సమస్యను అధిగమించాలంటే వీఎస్‌ఏలను తీసుకుని విధులు కేటాయిస్తే పట్టుపరిశ్రమకు పూర్వవైభవం తీసుకురావచ్చు.

- ఆంజనేయులు, పట్టుపరిశ్రమ శాఖ జిల్లా అధికారి

అసెంబ్లీలో ప్రస్తావించా



మల్బరీ సాగుకు రైతులు ముందుకు వస్తున్నారు. అవసరమైన సాంకేతిక సలహాలిచ్చేందుకు తగిన సిబ్బంది లేరని అధికారులు చెబుతున్నారు. పంటకు ఏ రోగం వచ్చింది, ఎందుకు వచ్చింది, సమస్య ఎక్కడుంది వంటి అంశాలపై సాంకేతిక పరంగా విశ్లేషణ చేయాలి. కూటమి ప్రభుత్వం రాయితీ మొత్తాలను పెంచింది. రేషం షెడ్డు నిర్మాణానికి ఎస్సీ, ఎస్టీలకు రూ.4.50 లక్షలు. ఇతర వర్గాలకు రూ.3.35 లక్షలకు రాయితీ మొత్తం పెరిగింది. మల్బరీ మొక్కలు నాటుకునేందుకు ఒక్కో యూనిట్‌కు ఎస్సీ, ఎస్టీలైతే రూ.23వేలు, ఇతరులైతే రూ.18వేలకు పెంచారు. ప్రభుత్వ ప్రోత్సహకాలను సమగ్రమంగా అమలు చేయాలంటే సరైన సిబ్బంది కావాలి. అదేవిధంగా గత ప్రభుత్వంలో చెల్లించాల్సిన బకాయి మొత్తాలను విడుదల చేయాలని అసెంబ్లీలో ప్రస్తావించాను.

-ఎంఎస్ రాజు, ఎమ్మెల్యే, మడకశిర

సోలార్ అక్రమాల అదానీని అరెస్టు చేయాలి
సీపీఐ నాయకుల డిమాండ్



ర్యాలీ చేస్తున్న సీపీఐ నాయకులు

అనంతపురం విద్య, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): సోలార్ విద్యుత్ కొనుగోలులో భారీగా అక్రమాలకు పాల్పడిన గౌతమ్ అదానీని వెంటనే అరెస్టు చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. సోలార్ విద్యుత్ కొనుగోలు వ్యవహారంలో అక్రమాలపై అనంతపురంలోని క్లాక్‌టవర్ వద్ద సీపీఐ నాయకులు శుక్రవారం నిరసన తెలిపారు. క్లాక్‌టవర్ చుట్టూ ర్యాలీ చేశారు. అదానీకి వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. తర్వాత అదానీ దిష్టిబొమ్మ దహనానికి యత్నించగా, పోలీసులు అడ్డుకున్నారు. దీంతో నాయకులు, పోలీసుల మధ్య పెనుగులాట జరిగింది. ఈ క్రమంలో దిష్టిబొమ్మ ధ్వంసమైంది. తర్వాత సీపీఐ నాయకులు.. అదానీ చిత్రపటాలను దహనం చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ మాట్లాడుతూ... అదానీకి ప్రధాని నరేంద్ర మోదీ బినామీగా వ్యవహరిస్తున్నారంటూ మండిపడ్డారు. సోలార్ విద్యుత్ కోసం ముడుపులు చెల్లించిన ఆయనను వెంటనే అరెస్టు చేయాలన్నారు. ఇప్పటికే అదానీ, ఆయన తమ్ముడు మరో 8 మందిపై కేసులు నమోదయ్యాయన్నారు. అంతర్జాతీయ స్థాయిలో భారతదేశం పరువు, ప్రతిష్టను అదానీ మంటగలిపారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి ప్రధాని నరేంద్రమోదీ నైతిక బాధ్యత వహించాల్సి ఉంటుందనీ, జాయింట్ పార్లమెంటరీ కమిటీ వేసి విచారణ చేయాలని డిమాండ్ చేశారు.

విద్యార్థిపై దూసుకెళ్లిన ప్రైవేటు బస్సు


అఖిల్ (ఫైల్)

పెనుకొండ రూరల్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): పెనుకొండ నగర పంచాయతీ ఇస్లాపురం గ్రామ సమీపంలోని ఘనగిరి పాఠశాలకు చెందిన ప్రైవేటు బస్సు విద్యార్థి అఖిల్(13)పై దూసుకెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. గ్రామస్థులు, బంధువులు తెలిపిన వివరాల మేరకు. ఇస్లాపురం గ్రామానికి చెందిన నాగరాజు, రాధమ్మ దంపతుల కుమారుడైన అఖిల్ పెనుకొండలోని శాంతినికేతన్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. శుక్రవారం ఉదయం అఖిల్ ఇంటి నుంచి సైకిల్‌లో పాఠశాలకు బయలుదేరాడు. గ్రామ సమీపంలోని నాగప్ప కుంట వద్ద ముందు వెళ్తున్న ప్రైవేటు బస్సు ఎదురుగా వస్తున్న ట్యాంకర్‌కు సైడ్ ఇవ్వడానికి ఉన్నఫలంగా వెనక్కి వచ్చింది. వెనుకే సైకిల్‌పై ఉన్న అఖిల్‌పై దూసుకెళ్లింది. తీవ్రంగా గాయపడిన అఖిల్‌ను పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఒక్కగానొక్క కుమారుడు మృతిచెందడంతో బంధువులు, కుటుంబ సభ్యులు బోరున విలపించారు. నిబంధనల ప్రకారం ప్రైవేటు స్కూల్ బస్సుకు క్లీనర్ తప్పనిసరిగా ఉండాలి. క్లీనర్ లేకుండా డ్రైవర్ ఒక్కసారిగా వెనక్కు రావడంవల్లే ప్రమాదం జరిగినట్లు గ్రామస్థులు తెలిపారు. పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బాలుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య


వెంకటేశ్ (ఫైల్)

ఉరవకొండ, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆమిద్యాల గ్రామానికి చెందిన రైతు వెంకటేశ్ అప్పుల బాధ భరించలేక గురువారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. వెంకటేశ్ తనకున్న ఎనిమిదెకరాల పొలంలో పంటలు సాగుచేస్తుండేవాడు. గొర్రెలను సైతం పెంచుతుండేవాడు. పొలంలో మిరప, వేరుశనగ పంటలను సాగు చేశాడు. రెండేళ్లుగా సరైన దిగుబడి రాక నష్టం వాటిల్లింది. ఇది చాలదన్నట్లు ఇటీవల 20కిపైగా గొర్రెలు మృతిచెందాయి. అప్పులు రూ.10లక్షలకు చేరాయి. వాటిని ఎలా తీర్చాలోనని ఆవేదన చెందుతుండేవాడు. ఈ నేపథ్యంలోనే గురువారం అర్ధరాత్రి గొర్రెల దొడ్డిలో ఉరేసుకున్నాడు. భోజనం తీసుకెళ్లిన కుటుంబీకులు గమనించి, వెంటనే కిందకు దించి ఉరవకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే రైతు మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. వెంకటేశ్‌కు భార్య గంగమ్మ, ఇద్దరు చొప్పున కుమార్తెలు, కుమారులు ఉన్నారు. ఆత్మహత్యపై పోలీసులు కేసు నమోదు చేసుకుని, మృతదేహానికి పోస్టుమార్టంకి తరలించారు.

విద్యుత్ కుంభకోణంలో జగన్‌పై కేసుపెట్టాలి
సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీశ్


మాట్లాడుతున్న జగదీశ్

గుంతకల్లు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): అధిక ధరలతో విద్యుత్ కొనుగోలు, ఆదానీ నుంచి లంచాలు తీసుకున్న నేరానికి మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిపై కేసుపెట్టాలని, అరెస్టు చేసి జైలుకు పంపాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డి. జగదీశ్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదానీ కంపెనీ నుంచి 3 వేల మెగావాట్ల విద్యుత్ కొనుగోలు వ్యవహారంలో జగన్మోహన్‌రెడ్డి అక్రమాలకు పాల్పడ్డారంటూ గతంలోనే పత్రికలు కథనాలను ప్రచురించాయన్నారు. ఇప్పుడు ఆ విషయాన్ని ధ్రువీకరిస్తూ ఆదానీ, జగన్మోహన్ రెడ్డితోపాటు ఎనిమిది మందిపై అమెరికా దర్యాప్తు సంస్థలు కేసులు నమోదుచేశాయన్నారు. ఆదానీ ద్వారా గుజరాత్ రాష్ట్రం కొన్న ధర కంటే అధికంగా ఏపీలో అప్పటి ముఖ్యమంత్రి జగన్ ఒప్పందం కుదుర్చుకున్నారని, అందుకు రూ. 1,750 కోట్ల లంచం తీసుకున్న అభియోగాలు నమోదయ్యాయన్నారు. స్మార్ట్ మీటర్ల కొనుగోలులోనూ ఇదే తరహా అక్రమం జరిగిందని ఆరోపించారు. ఈ ఆర్థిక నేరంపై జగన్‌పై కేసు నమోదుచేసి, అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో సీపీఐ నాయకులు బి. గోవిందు, గోపీనాథ్, మహమ్మద్ గౌస్, బి. మహేశ్, రాము, రామాంజనేయులు పాల్గొన్నారు.

హైకోర్టు బెంచ్ ఏర్పాటుపై హర్షం
చంద్రబాబు చిత్రపటానికి న్యాయవాదుల క్షీరాభిషేకం


చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న న్యాయవాదులు

హిందూపురం, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు ఆమోదం తెలపడంతో పురం న్యాయవాదులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్రపటానికి శుక్రవారం స్థానిక కోర్టు ఆవరణలో క్షీరాభిషేకం చేశారు. అనంతరం న్యాయవాదులు మాట్లాడుతూ.. 2019 ఎన్నికల సమయంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారన్నారు. తర్వాత వైసీపీ అధికారంలోకి రావడంతో అది నెరవేరలేదన్నారు. యువనేత నారా లోకేశ్ యువగళం పాదయాత్ర సందర్భంగా కూటమి అధికారంలోకి వస్తే బెంచ్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. దానిని నెరవేరుస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయడం అభినందనీయమన్నారు. కూటమి ప్రభుత్వం.. రాయలసీమపై కరుణ చూపిందన్నారు. టీడీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు శివశంకర్ మాట్లాడుతూ.. హైకోర్టు బెంచ్ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామన్నారు. లోకాయుక్త, మానవ హక్కుల న్యాయస్థానాలను కర్నూలు నుంచి తరలించేది లేదని సీఎం చెప్పడం ఈ ప్రాంత న్యాయవాదులకు ఎంతో లబ్ధి చేకూరుస్తుందన్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు న్యాయవాదులు రుణపడి ఉంటారన్నారు. కార్యక్రమంలో పురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజశేఖర్, కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, న్యాయవాదులు సుదర్శన్, సిద్దు, నాగేంద్ర, మనోహర్‌రెడ్డి, నాగరాజారెడ్డి, కోదండరామారావు, అభిషేక్, రకీబ్, వెంకటేశ్, ఈశ్వర్ పాల్గొన్నారు.

న్యూస్‌బాక్స్

జాతీయస్థాయి పోటీలకు మయాంక్



అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): హాకీ జాతీయ ఎస్‌జీఎఫ్-19 పోటీలకు జిల్లాకు చెందిన మయాంక్ ఎంపికయ్యాడు. ఇటీవల కాకినాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో సత్తా చాటిన మయాంక్ జాతీయ పోటీలకు అర్హత సాధించాడు. డిసెంబరు మొదటి వారంలో రాంచీలో నిర్వహించే పోటీలకు ఏపీ రాష్ట్ర జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించనున్నాడు. ఎస్‌జీఎఫ్-19 జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ అభినందించారు.

చీనీ టన్ను రూ.38వేలు

అనంతపురంరూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం చీనీ కాయలు టన్ను గరిష్ఠంగా రూ.38,650, కనిష్ఠంగా రూ.13వేలు, సరాసరి రూ.32,800తో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 85 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

టమోటా కిలో రూ.26

అనంతపురంరూరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.26తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. శుక్రవారం మార్కెట్‌కు 825 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.20, కనిష్ఠ ధర రూ.13 పలికినట్లు ఆయన తెలిపారు.

నేడు, రేపు ఓటరు నమోదు

అనంతపురం టౌన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా శని, ఆదివారాలలో ఓటరు నమోదుకు ప్రత్యేకంగా దరకాస్తులు స్వీకరిస్తున్నట్లు కలెక్టర్ వినోద్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా 8 నియోజకవర్గాలలో కలిపి 20,20,441 మంది ఓటర్లు ఉన్నారని అన్నారు. గతనెల 29న ముసాయిదా ఓటర్ల జాబితాను ఇచ్చామన్నారు. అందులో ఓటరుగా అర్హత ఉండి జాబితాలో లేనివారు, 2025 జనవరి 1 నాటికి 18 ఏళ్ల నిండుతున్నవారు ఈనెల 28 వరకు ఓటరుగా నమోదుచేసుకోవచ్చన్నారు. ఓటు నమోదు కోసం ప్రత్యేకంగా పోలింగ్ బూత్‌లలో దరకాస్తులు స్వీకరిస్తామన్నారు.

రేపటి నుంచి ఉద్యోగుల క్రికెట్ పోటీలు


అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఏపీ వెటరన్ క్రికెట్ అసోసియేషన్, ఏపీ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ట్రస్టు సంయుక్తంగా ఆర్డీటీ స్టేడియంలో ఈనెల 24 నుంచి ఉమ్మడి జిల్లా స్థాయిలో ప్రభుత్వ ఉద్యోగుల క్రికెట్ టోర్నీ నిర్వహించనున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు మచ్చా రామలింగారెడ్డి తెలిపారు. ఉద్యోగుల క్రికెట్ పోటీలకు సంబంధించిన పోస్టర్లు శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో డీఆర్వో మలోలా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామలింగారెడ్డి మాట్లాడుతూ సెలవు దినాల్లో మాత్రమే పోటీలు ఉంటాయన్నారు. పోటీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు అర్హులన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్లు 94900 62555, 7386958666ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో నిర్వాహణ కమిటీ సభ్యులు విజయరామరాజు, సతీష్, మారుతి, శ్రీకాంత్, నరేష్ పాల్గొన్నారు.

జిల్లాలో 203 నీటి కుంటల నిర్మాణం
- డ్వామా పీడీ సలీం బాషా

ఉరవకొండ, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 203 నీటి సంరక్షణ కుంటల నిర్మాణాలు చేపడుతున్నట్లు డ్వామా పీడీ సలీంబాషా పేర్కొన్నారు. పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో చేపడుతున్న నీటి కుంటల నిర్మాణ పనులను పీడీ శుక్రవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భవనాల నుంచి వచ్చే వర్షపు నీటిని నీటి కుంటలో ఇంకడం వల్ల భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. అందుకోసం జిల్లాలో ఇప్పటికే 180 నీటి సంరక్షణ నిర్మాణ పనులు పూర్తి అయ్యాయని తెలిపారు. ప్రధానంగా ప్రభుత్వ విద్యాసంస్థలు, కార్యాలయాల్లో వీటి నిర్మాణాలకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. గ్రామాల్లో త్వరలోనే ఉపాధి హామీ పనులు చేపడతామన్నారు. ఉపాధి హామీ పనుల్లో అక్రమాలకు పాల్పడిన వారిపై ఆర్‌ఆర్ యాక్టు కేసు నమోదు చేస్తామన్నారు. సామాజిక తనిఖీలలో రికవరీల కోసం నోటీసులు ఇస్తామని తెలిపారు. సమావేశంలో ఏపీడీ శైలజ, ఎంపీడీవో రవిప్రసాద్, ఏపీవో విమల, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.


నీటి కుంటను పరిశీలిస్తున్న పీడీ సలీం బాషా

టీడీపీతోనే అందరికీ రాజకీయ చైతన్యం
- ఆర్టీసీ కడప జోనల్ చైర్మన్ పూల నాగరాజు


బాధ్యతలు చేపడుతున్న పూల నాగరాజు

అనంతపురం కల్చరల్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): సమాజంలోని అన్ని సామాజిక వర్గాలకు రాజకీయ చైతన్యం కల్పించడం టీడీపీతోనే సాధ్యమని ఏపీఎస్ ఆర్టీసీ కడప జోనల్ చైర్మన్ పూల నాగరాజు పేర్కొన్నారు. కడప జోనల్ చైర్మన్‌గా నియమితుడైన పూలనాగరాజు శుక్రవారం అనంతపురం బస్టాండుపై గల తన కార్యాలయం వద్ద ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఆర్టీసీ ఈడీ చంద్రశేఖర్ సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో పూల నాగరాజు మాట్లాడుతూ... బడుగు, బలహీన వర్గాలను సైతం అందలమెక్కించే దిశగా టీడీపీ కూటమి పాలన సాగిస్తోందన్నారు. జోనల్ పరిధిలో ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపడంతోపాటు ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందించేలా చర్యలు చేపడతామన్నారు. ఆర్టీసీ సిబ్బందితోపాటు ప్రయాణికులకు సైతం అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. అనంతరం ఆర్టీసీ సిబ్బందితోపాటు టీడీపీ నాయకులు పెద్దఎత్తున బస్టాండుకు చేరుకుని పూల నాగరాజుకు పుష్పగుచ్ఛాలు, శాలువాలతో అభినందించారు. కార్యక్రమంలో ఆర్టీసీ అనంతపురం రీజనల్ మేనేజర్ సుమంత్ ఆర్ ఆదోని, డీఎం నాగభూపాల్, మాజీ మేయర్ మదమంచి స్వరూప, జితేంద్రగౌడ్, వేణుగోపాల్, కృష్ణంరఘు, ఆర్టీసీ ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

యాంటీబయాటిక్ ప్రమాదకరం
డాక్టర్ల సలహా మేరకే మందులు వాడాలి
సూపరింటెండెంట్, ప్రిన్సిపాల్ సూచన



ర్యాలీ నిర్వహిస్తున్న ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్, డాక్టర్లు, మెడికోలు

అనంతపురం టౌన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): అధికంగా యాంటీ బయాటిక్ మందులువాడకం ప్రమాదకరమని ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యాలరావు సూచించారు. ప్రపంచ ఔషధ నిరోధక అవగాహన కార్యక్రమాలలో భాగంగా శుక్రవారం మెడికోల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్, మైక్రో బయోలజీ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం కళాశాలలో ఏర్పాటు చేసిన సదస్సులో సూపరింటెండెంట్, ప్రిన్సిపాల్ మాట్లాడుతూ యాంటీబయాటిక్‌మందులు అనవసరంగా వాడరాదన్నారు. అధికంగా వాడకంవల్ల శరీరంలో ఉండే బ్యాక్టీరియాలు చనిపోయి జీర్ణకోశ, పెద్దపేగు, చిన్నపేగు సమస్యలు ఉత్పన్నమవుతాయని తెలిపారు. సొంతవైద్యంతో మాత్రలు వాడడం మరింత ప్రమాదకరమని, డాక్టర్ల సలహామేరకే తగిన మోతాదులో వాడాలని సూచించారు. కార్యక్రమంలో మైక్రో బయాలజీ విభాగాధిపతి డాక్టర్ శాంతిరెడ్డి, మెడికల్ కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ షారోన్‌సోనియా, సీనియర్ వైద్యులు హైమావతి, ఉమాదేవి, ప్రవీణ, ప్రియాంక, ఆశాలత, పద్మశ్రావణి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ పరదేశీనాయుడు పాల్గొన్నారు.

కణేకల్లు యువకుడికి పురస్కారం


సర్మాస్‌కు అవార్డును ప్రదానం చేస్తున్న జాయింట్ డైరెక్టర్

కణేకల్లు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన మణేగార్ సర్మాస్‌వలి అనే యువకుడికి కర్ణాటక రాష్ట్రంలో అరుదైన పురస్కారం లభించింది. వ్యవసాయ, పునరుత్పత్తి రంగాల్లో విశిష్ట సేవలకు గాను కర్ణాటక ప్రభుత్వ ఎలక్ట్రానిక్, ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ జాయింట్ డైరెక్టర్ బాలకృష్ణ సర్మాస్‌వలికి అప్రిసియేషన్ అవార్డును అందజేశారు. శుక్రవారం బెంగుళూరులోని చాణక్య ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో సర్మాస్‌వలికి సత్కరించి ఈ అవార్డును ప్రదానం చేశారు. సర్వోన్నత ఉపగ్రహ పేలోడ్ టెక్నాలజీ సహాయంతో వ్యవసాయంలో పంట ఉత్పత్తి అంచనాలను సులభతరం చేయడం, సౌరశక్తి సామర్థ్యాన్ని మెరుగు పరచడంలో సర్మాస్‌వలి ఓ ప్రాజెక్టును రూపొందించారు. అది అక్కడి ప్రభుత్వానికి ఉపయోగకరంగా ఉండడంతో ఈ అవార్డును అందజేశారు. కణేకల్లుకు చెందిన సర్మాస్‌వలి బెంగుళూరులో ఇలాంటి ప్రయోగాలు చేసి అవార్డులు అందుకోవడం అభినందనీయమని పలువురు కొనియాడారు.

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో సత్తా


ట్రోఫీతో జశ్వంత్

గుత్తిరూరల్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని సేవాఘడ్ గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థి జశ్వంత్ రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీల్లో రెండో స్థానం సాధించాడు. ఈ నెల 19 నుంచి 21 వరకు మచిలీపట్నంలో రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గొందిపల్లికి చెందిన జశ్వంత్ రెండో స్థానం సాధించాడు. సేవాఘడ్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. పీఈటీ విజయకుమార్‌నాయక్‌తో కలిసి శుక్రవారం సేవాఘడ్‌కు వచ్చాడు. పాఠశాల ప్రిన్సిపాల్ ఫయాజ్, కోచ్ పెద్దక్క, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జశ్వంత్‌ను అభినందించారు.

న్యూస్ బాక్స్

ఓటు హక్కు వినియోగించుకున్న ఎమ్మెల్యేలు




ఓటు వేస్తున్న ఎమ్మెల్యేలు పరిటాల సునీత, దగ్గుపాటి

అనంతపురం అర్బన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర ప్రదేశ్ శాసనసభ ఆర్థిక కమిటీ (పీఏసీ) సభ్యుల ఎన్నిక పోలింగ్‌లో ఎమ్మెల్యేలు పరిటాల సునీత, దగ్గుపాటి వెంకటేశ్వ ర్రప్రసాద్ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. శుక్ర వారం అసెంబ్లీలో నిర్వహించిన మూడు కమిటీల సభ్యుల ఎన్నిక పోలింగ్‌లో ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

ఆర్టీసీ రీజనల్ చైర్మన్ నాగరాజుకు శుభాకాంక్షలు



పూల నాగరాజుకు శుభాకాంక్షలు తెలుపుతున్న సిమెంట్ పోలన్న, జెరిపిటి కృష్ణమూర్తి

అనంతపురం అర్బన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీ కడప రీజనల్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన పూల నాగరాజుకు టీడీపీ బీసీ సెల్ నాయకులు వడ్డే సిమెంట్ పోలన్న, సత్యసాయి జిల్లా వడ్డెర సంక్షేమ సంఘం అధ్యక్షుడు జెరిపిటి కృష్ణమూర్తి శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం స్థానిక అనంతపురం ఆర్టీసీ బస్టాండ్ ఆవరణంలోని రీజనల్ చైర్మన్ కార్యాలయంలో పూల నాగరాజును కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్‌కు సన్మానం



కొండన్నను సన్మానిస్తున్న నాయీబ్రాహ్మణులు

అనంతపురం అర్బన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ కడియాల కొండన్నను పలువురు టీడీపీ నాయకులు సన్మానించారు. శుక్రవారం అనంతపురం పాతూరులోని ఆయన నివాసం వద్ద నాయకులు గోవింద్, మునీంద్ర, రామాంజి, ధన, తిమ్మప్ప, రవి ఆయనకు శాలువ కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

జిల్లా జైలును సందర్శించిన డీఎల్ఎస్ఏ కార్యదర్శి



వృద్ధులతో మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి

అనంతపురం క్రైం,నవంబరు 22(ఆంధ్రజ్యోతి): జిల్లా న్యాయసేవాధికారసంస్థ కార్యదర్శి, సివిల్ న్యాయాధికారి శివప్ర సాద్ యాదవ్ శుక్రవారం జిల్లా జైలును సందర్శించారు. ప్రభుత్వ బాలుర హోమ్ అబ్జర్వేషన్ హోమ్‌ను సందర్శించారు. జిల్లా జైలు ఖైదీలతో సంభాషించారు. ఖైదీల ఆహారం, నివాసం, ఆరోగ్య స్థితిగతులు, జైలు అధికారుల ద్వారా అందజేస్తున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. న్యాయసేవల లభ్యత, అప్పీల్ హక్కు, బేరసారాలు, న్యాయసహాయం పనితీరు గురించి ఖైదీలకు వివరించారు. అనంతరం ఆకుతోటపల్లి సమీ పంలోని వృద్ధాశ్రమంలో సీనియర్ సిటిజన్ల సంక్షేమం, నిర్వ హణ చట్టం-2007పై అవగాహన కల్పించారు. పింఛన్, రేషన్, ఆధార్ కార్డుల సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు.

పానకాలస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే



స్వామిని దర్శించుకుంటున్న పరిటాల సునీత

అనంతపురం అర్బన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కార్తీక శుక్రవారం పర్వదినాన్ని పురస్కరించుకుని గుంటూరు జిల్లా మంగళగిరిలో కొలువైన పానకాల లక్ష్మీనరసింహ స్వామిని ఎమ్మెల్యే పరిటాల సునీత దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బనానా రైలు ప్రారంభం హర్షణీయం: ఎమ్మెల్యే

శింగనమల, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): బనానా రైలు ప్రారంభించడం అరటి రైతులకు వరం లాంటిదని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అన్నారు. శుక్రవారం తాడిపత్రి నుంచి రైలు ప్రారంభంపై ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గం లోని పుట్లూరు, యల్లనూరు, బుక్కరాయసముద్రం, నార్పల మండలాల్లో 6,477 ఎకరాల్లో రైతులు అరటి సాగు చేసి 4.9 మెట్రిక్ టన్నులు ఎగుమతి చేస్తున్నారన్నారు. నియోజకవర్గం లోని అరటి ఉత్పత్తులు విదేశాలకు ఎగుమతి అయ్యే సౌకర్యం కల్పించిన సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవ న్‌కల్యాణ్, వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడుకు కృతజ్ఞ తలు తెలుపుతున్నానని అన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి స్థల పరిశీలన

ఆత్మకూరు నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని తోపుదుర్తి గ్రామంలో నూతన సబ్‌స్టేషన్ నిర్మాణానికి ట్రాన్స్ కో అధికారులు, స్థానిక టీడీపీ నాయకులతో కలసి శుక్రవారం స్థలాన్ని పరిశీలించారు. ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదేశాల మేరకు ఈఈ మనోరమ, డీఈ రంగస్వామి, ఏఈ దాసు సబ్ స్టేషన్ నిర్మాణానికి కావలసిన స్థలాన్ని పరిశీలించి కొలతలు తీసుకున్నారు. మండల కన్వీనర్ శ్రీనివాసులు, శశాంక చౌదరి, మాజీ జడ్పీటీసీ కుళ్లాయప్ప, శ్రీనివాసరెడ్డి, బాలానాయక్, రాము సందీప్ చౌదరి, లింగమయ్య,రాజేష్ పాల్గొన్నారు.

26న కలెక్టరేట్ ఎదుట ధర్నా

అనంతపురం విద్య, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానా లను నిరసిస్తూ జాతీయ కార్మిక, రైతు సంఘాల పిలుపు మేరకు 26న కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు ఏఐటీయూసీ నాయకులు తెలిపారు. శుక్రవారం ఆ సంఘం కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు రాజేష్‌గౌడ్ అధ్యక్షతన జిల్లా ఆఫీస్ బేరర్ల సమావేశం నిర్వహించారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి మాట్లా డుతూ విద్యుత్ శాఖ ఉద్యోగుల కళాభారతిలో జరిగిన అక్రమాలపై విచారణ చేయాలన్నారు. 12 ఏళ్లుగా కళాభారతిలో భారీగా అవినీతి చోటుచేసుకుందన్నారు. ఓపెన్ టెండర్ల ద్వారా సుమారు రూ.70 లక్షల నుంచి రూ.80 లక్షలు వరకూ డిపాజిట్‌గా రావాల్సిన సొమ్ము ఎక్కడికెళ్లిందని ఆయన ప్రశ్నించారు. సంఘం నాయ కులు కృష్ణుడు, నాగవేణి, శ్రీనివాసులు, మల్లికార్జున పాల్గొన్నారు.

పైపై మెరుగులే..!

- రోడ్లకు నాసిరకంగా ప్యాచ్ వర్కులు
- ప్రభుత్వ లక్ష్యాన్ని నీరుగారుస్తున్న కాంట్రాక్టర్లు

కనగానపల్లి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): గుంతల రోడ్లతో ప్రజల ఇబ్బం దులు గమనించిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వాటిని పూడ్చాలని నిశ్చయించింది. గుంతలు పూడ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఎక్కడెక్కడ గుంతలు ఉన్నాయో వాటిని గుర్తించి పూడ్చాలని ఆర్ అండ్‌బీ అధికారులకు అప్పచెప్పి, అందుకు తగ్గట్టుగా నిధులు మంజూరు చేసింది. కనగానపల్లి మండలంలో గుంతల రోడ్లకు మరమ్మతు పనులు నాసిరకంగా జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దెబ్బతిన్న రోడ్లను వివిధ రకాలగా గుర్తించి పనులు చేపట్టాలి. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్లు ఇష్టానుసారంగా పనులు చేపడుతున్నారు. లెస్నీ పనులు చేపట్టాల్సిన చోట పైపై మెరుగులు దిద్దుతూ, తారు, కంకర వేసి



రోలరుతో కంకరును చదను చేస్తున్న దృశ్యం



తారు, కంకర వేసి పైపై మెరుగులు దిద్దుతున్న దృశ్యం

రోడ్డు రోలరుతో చదును చేస్తున్నారు. దెబ్బతిన్న రోడ్లను తవ్వి కంకర, వైట్ మిక్స్ వేసి రోలరుతో చదును చేయాలి. అనంతరం తారు, కంకర వేసి రోల రుతో చదును చేస్తే రోడ్లు కొన్నేళ్లపాటు నాణ్యతగా ఉంటాయి. కాంట్రాక్టర్లు రోడ్లకు పైపై మెరుగులు దిద్దుతూ ప్రభుత్వ లక్ష్యాన్ని నీరుకారుస్తున్నారు. గుంతల రోడ్లకు తాత్కాలిక పనులు చేపట్టి మమా అనిపిస్తున్నారు.

చర్యలు చేపడతాం: హారిక, ఆర్అండ్‌బీ జేఈ

దెబ్బతిన్న రోడ్లలో ప్యాచ్ వర్క్, అవసరమున్న చోట లెస్నీ పనులు చేస్తు న్నాం. పనులను కాంట్రాటక్టర్లు నిబంధనల మేరకు నాణ్యతగా చేపట్టాలి. పనులు పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదికలు పంపి తగు చర్యలు తీసుకుంటాం.

ప్రజలను అప్రమత్తం చేయండి: ఎస్పీ

అనంతపురం క్రైం,నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): నేరాలు జగరకముందే ప్రజలను అప్రమత్తం చేస్తూ, వివిధ అంశాలపై అవగాహన చేయడం వల్ల ప్రయోజనముంటుందని ఎస్పీ జగదీష్ అన్నారు. శుక్రవారం ఎస్పీ ఓ ప్రకటన ద్వారా పోలీసులకు ఆదేశాలిచ్చారు. మహిళలు, విద్యార్థుల్లో అవగాహన తీసు కురావడం ముఖ్యమన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ మధ్య తేడా వివరించడం, అనుమానాస్పద వ్యక్తులు, వారి వ్యవహార శైలిని గుర్తించడం, స్వీయ రక్షణ, బాల్య వివాహాలు, మహిళలపై జరుగుతున్న నేరాలు, ఈవ్ టీజింగ్, వర కట్నం, చట్టాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించాలన్నారు.

బ్యూటీపార్లర్ నిర్వాహకురాలి అదృశ్యం

అనంతపురం క్రైం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): నగరంలో బ్యూటీ పార్లర్ నిర్వహిస్తున్న ఓ మహిళ అదృశ్యమైంది. నగరంలోని ఎల్‌బీ నగర్‌కు చెందిన అనిత ఐదో రోడ్డులో బ్యూటీ పార్లర్ నిర్వహిస్తోంది. ఈక్ర మంలో గురువారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆమె కుటుంబసభ్యులు త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఏఆర్ డీఎస్పీగా నీలకంఠేశ్వర్‌రెడ్డి

ఏఆర్ డీఎస్పీగా నీలకంఠేశ్వర్‌రెడ్డిని నియమించారు. అప్పా డీఎస్పీ(అ టాచ్డ్ పీటీసీ)గా నీలకంఠేశ్వర్‌రెడ్డిని ఏఆర్ డీఎస్పీగా బదిలీ చేశారు. ఇది వరకు ఏఆర్ డీఎస్పీగా ఉన్న మునిరాజా పదోన్నతిపై వెళ్లినప్పటి నుంచి ఆ పోస్టు ఖాళీగా ఉంది. త్వరలో ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు.

బాలుడి డ్రైవింగ్.. ఇద్దరికి గాయాలు

ఓ బాలుడు ద్విచక్రవాహనం నడపడంతో మరో వాహనం ఢీకొని ఇద్దరు బాలలు గాయపడ్డారు. నగరంలోని భాగ్యనగర్‌కు చెందిన 15 ఏళ్ల షాషావలి, 13 ఏళ్ల మాలిక్ తమ ఇంటి నుంచి బయలుదేరారు. బసవన్న కట్ట సమీపంలోకి రాగానే వారు వెళ్తున్న బైక్‌ను మహీంద్ర గూడ్స్ వెహి కల్ ఢీకొంది. దీంతో షాషావలి తలకు, కాలికి గాయాలు కాగా మాలిక్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ట్రాఫిక్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వారసత్వ సంపదను భవిష్యత్తు తరాలకు అందించాలి

అనంతపురం కల్చరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా వారసత్వ సంపదను భవిష్యత్తు తరాలకు అందించేందుకు ప్రతిఒక్కరూ బాధ్యత వహించాలని అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న పేర్కొన్నారు. ప్రపంచ వార సత్వ వారోత్సవాలు-2024 కార్యక్రమంలో భాగంగా ఐదవరోజున శుక్ర వారం ఆదిమూర్తినగర్‌లోని జిల్లా పురావస్తుశాఖ కార్యాలయంలో 7 నుంచి 9వ తరగతి విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వ హించారు. ఇంటాక్ కన్వీనర్ రామ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి అసిస్టెంట్ కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. జిల్లా పురావస్తుశాఖ ఏడీ రజిత, ఇంటాక్ మాజీ కన్వీనర్ ఏజీ వేణుగో పాల్, సభ్యుడు కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కవి కంబదూరి షేక్ నబిరసూల్, షేక్ రియాజుద్దీన్, ఏజీ అనిల్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

2030 నాటికి క్షయ రహిత భారత్

- జిల్లా కేంద్రాల్లో టీబీ టెస్టింగ్ ల్యాబ్స్
- ఎన్ఐఆర్టీ శాస్త్రవేత్త డాక్టర్ అజ్జర్ దుస్తాకీర్

అనంతపురం సెంట్రల్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రపంచ దేశాల్లో 2030 నాటికి భారత్.. క్షయ రహిత దేశంగా నిలబోతోందని చైన్నై నేష నల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ రీసర్చ్ ఇన్ ట్యూబర్ క్యులోసిస్ (ఎన్ఐఆర్టీ) శాస్త్ర వేత్త డాక్టర్ అజ్జర్ దుస్తాకీర్ పేర్కొన్నారు. శుక్రవారం జేఎన్‌టీయూ ఓటీ పీఆర్ఐ కళాశాలలో క్షయవ్యాధి నివారణ అంశంపై సదస్సు నిర్వహిం చారు. ఈ సందర్భంగా డాక్టర్ అజ్జర్ దుస్తాకీర్ మాట్లాడుతూ క్షయ వ్యాధి నిర్ధారణకు దేశంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో టీబీ టెస్టింగ్ ల్యాబ్స్ అందు బాటులో ఉన్నాయని తెలిపారు. శాంపిల్స్ సేకరించిన రెండు గంటల్లోపే ఫలితాలను ఇస్తున్నట్లు పేర్కొన్నారు. వ్యాధి సోకిన వారికి ఆరు నెలల్లో నయమయ్యేలా అన్ని రకాల మందులు ఇస్తున్నారని తెలిపారు. క్షయ వ్యాధి పూర్తి నయం అయ్యే వ్యాధి అని, తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. వ్యాధి వ్యాప్తిని అరికట్టేందుకు ప్రపంచ ఆరోగ్య సంస్థ విస్తృతంగా ప్రచారం చేస్తోందన్నారు. ముఖ్యంగా 2030నాటికి క్షయరహిత దేశం కోసం ప్రధాని నరేంద్రమోదీ పనిచేస్తు న్నట్లు తెలిపారు. అనంతరం ఆయన్ను డైరెక్టర్ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గోపీనాథ్, ప్రొఫెసర్ దిలీప్‌కుమార్, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

26 నుంచి డిగ్రీ మెగా సప్లిమెంటరీ

- 57 పరీక్షా కేంద్రాల ఏర్పాటు

అనంతపురం సెంట్రల్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ఎస్కేయూ ఆధ్వ ర్యంలో ఈనెల 26 నుంచి డిగ్రీ మెగా సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తు న్నట్లు వర్సిటీ కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ లోకేష్ తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 57 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ నెల 26 నుంచి డిసెంబరు 27వరకు 3, 5వ సెమిస్టర్ల విద్యార్థులకు రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. శనివారం నుంచి హాల్‌టిక్స్‌ను జ్ఞానభూమి పోర్టల్లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చునని సూచించారు. సప్లిమెంటరీ విద్యార్థులైతే ఎస్కేయూ వెబ్‌సైట్‌లోకూడా డౌన్‌లోడ్ చేసుకోవచ్చునని తెలిపారు. వివరాలకు తమ కళాశాలలను సంప్రదించి సందేహాలను నివృత్తి చేసుకోవచ్చునని పేర్కొన్నారు.

పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వద్దు

అనంతపురంరూరల్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): పారిశుధ్య పనుల నిర్వహణలో నిర్లక్ష్యం చేయొద్దని ఈఓఆర్డీ వెంకటనాయుడు అన్నారు. శుక్రవారం మండలంలోని కక్కలపల్లి కాలనీలో జరుగుతున్న శానిటేషన్ పనులను పంచాయతీ కార్యదర్శి హిదయుతుల్లాతో కలసి ఈఓఆర్డీ పరిశీ లించారు. తరచూ డ్రైనేజీలను శుభ్రం చేయాలన్నారు. అపరిశుభ్రతతో వ్యాధులు ప్రబలడంతో పాటు దోమల వృద్ధిచెందే అవకాశం ఉందన్నారు. దోమల నియంత్రణకు రాత్రివేళ్లలో ఫాంగింగ్ చేయాలని ఆదేశించారు.

టీడీపీ కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న రామలింగారెడ్డి

బుక్కరాయసముద్రం నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో మృతి చెందిన టీడీపీ కార్యకర్త కురుబ పోతులయ్య కుటుంబానికి టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కాటప్పగారి రామలింగారెడ్డి ఆర్థికసాయం అందజేశారు. వెంకటాపురం గ్రామానికి చెందిన పోతులయ్య రెండు రోజు క్రితం మృతిచెందారు. ఆ కుటుంబానికి రామలింగారెడ్డి రూ.10 వేలు ఆర్థి కసాయం అందజేశారు. జిల్లా నాయకులు మల్లికార్జునరెడ్డి, చెరుకూరి నారాయణస్వామి, అంజి, బాషా, నారాయణస్వామి పాల్గొన్నారు.

ప్రజాసమస్యలపై పోరాడేవారికే స్థానం

- సీపీఎం నగర 2వ కమిటీ కార్యదర్శి ఆర్‌వీ నాయుడు

అనంతపురం కల్చరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యలపై నిష్పక్షపాతంగా పోరాడేవారికే సీపీఎంలో స్థానం ఉంటుందని ఆ పార్టీ నగర 2వ కమిటీ కార్యదర్శి ఆర్‌వీ నాయుడు అన్నారు. స్థానిక గణేనాయక్ భవన్‌లో శుక్రవారం నిర్వహించిన పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లా డారు. పేద ప్రజల అవసరాలను అవకాశంగా తీసుకుని అవినీతికి పాల్పడిన లక్ష్మీనారాయణను పార్టీ నుంచి బహిష్కరించటం పట్ల కాలనీవాసులు అభి నందనలు తెలిపారన్నారు. పార్టీ విలువలను కాపాడుకోవడమే సీపీఎం విష్టత అన్నారు. నగర కార్యదర్శివర్గ సభ్యులు ముత్తుజా, గోపాల్, ఓబులేసు, ఇర్ఫాన్, కాలనీవాసులు పాల్గొన్నారు.

అయ్యప్ప మాలధారులకు అన్నదానం



అన్నదానం చేస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): శబరిమలకు పాద యాత్రగా వెళ్తున్న అయ్యప్ప మాలధారుల బృందానికి అన్నదానం నిర్వహిం చారు. 10వ తేదీన హైదరాబాద్‌లోని తుక్కుగూడ అయ్యప్పస్వామి ఆలయం నుంచి శబరిమలకు పాదయాత్రగా బయలుదేరిన బృందం శుక్రవారం అనం తపురం నగరానికి చేరుకుంది. సాయి ట్రస్టు అధ్యక్షుడు విజయసాయికుమార్ బృందం అయ్యప్పల బృందానికి స్వాగతం పలకడంతోపాటు తపోవనంలోని చిన్మయ జగదీశ్వరాలయంలో అన్నదానం చేశారు. గురుస్వామి వేణుగోపాల్, కిశోర్‌గౌడ్, చిన్మయ జగదీశ్వరాలయం కోశాధికారి రఘు, కార్యవర్గ సభ్యుడు రామాంజనేయులు, ట్రస్టు సభ్యులు నారాయణనాయక్, రాఘవేంద్ర, ఫణీంద్ర పాల్గొన్నారు.

అన్ని పంటలకు రీ షెడ్యూలు చేయాలి

గార్లదిన్నె, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): అన్ని పంటలకు బ్యాంకులో రీ షెడ్యులు చేయాలని రాయలసీమ రైతు సంఘం (ఆర్ఆర్ఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి అక్బర్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక రైతులతో కలసి అక్బర్ ఆధ్వర్యంలో స్థానిక కెనరా బ్యాంకు మేనేజర్‌ను కలిశారు. ఆయన మాట్లాడుతూ వ్యవసాయంలో నిత్యం నష్టాలను చవిచూస్తున్న అన్నదాతలు ప్రతి ఏడాది అప్పులు చేసి పంటలు సాగుచేస్తున్నారన్నారు. పంటలు పండక పండిన పంటలకు గిట్టుబాటు ధర లేక ఎంతోమంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. బ్యాంకులో రుణాలు తీసుకున్న అందరికి రీ షెడ్యూలు చేయాలన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని బ్యాంకు మేనేజర్ వెంకటశివారెడ్డికి అందచేశారు. సుబ్బన్న, రాము తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఖో-ఖో పోటీలకు ఎంపిక

కనగానపల్లి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి ఖోఖో పోటీ లకు కనగానపల్లి విద్యార్థి ఎంపికైనట్లు పీఈటీ రమేష్ తెలిపారు. స్కూల్ గేమ్స్ ఖోఖోపోటీలు శుక్రవారం అనంతపురంలో జరిగాయి. అండర్14 విభాగంలో కనగానపల్లి జడ్పీ పాఠశాల విద్యార్థి వైష్ణవి ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైందన్నారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు అబ్బాస్‌తో పాటు గ్రామస్థులు విద్యార్థినిని అభినందించారు.

'తహసీల్దార్ భూమి ఇస్తే.. వెటర్నరీ అధికారులు అడ్డుకున్నారు'

బుక్కరాయసముద్రం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): హత్యకు గురైన దళిత యువతి కుటుంబానికి భూమి ఇస్తే వెటర్నరీ అధికారులు అడ్డుకున్నా రని సాకే హరి విమర్శించారు. దీనిపై శుక్రవారం సాకే హరి బాధిత కుటుంబ సభ్యులతో కలిసి తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఆయన మాట్లా డుతూ 2019లో దళిత యువతి స్నేహలతను అత్యంత కిరాతంగా హత్య చేయడంతో అప్పట్లో ఆ యువతి కుటుంబానికి సిద్దరాంపురం గ్రామ నంబరు 188-1బీలో ఐదు ఎకరాల ప్రభుత్వ భూమిని ఆమె తల్లి లక్ష్మీదేవి పేరుపై ఇచ్చారన్నారు. ఈ భూమి వెంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీకి చెందిందని అధికారులు చెబుతున్నారన్నారు. యువతి కుటుంబానికి భూమి ఇచ్చేవరకు పోరాటాన్ని కొనసాగిస్తామని ఆయన హెచ్చరించారు.

సభ్యత్వ నమోదును వేగవంతం చేయండి

- పరిశీలకుడు లక్ష్మీనారాయణ

అనంతపురం అర్బన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో సభ్యత్వ నమోదును మరింత వేగవంతం చేయాలని నియోజకవర్గ పరిశీలకుడు లక్ష్మీనారాయణ సూచించారు. శుక్రవారం అనం తపురం అర్బన్ టీడీపీ కార్యాలయంలో పార్టీ నాయకులతో ఆయన సమా వేశమయ్యారు. ఇక్కడ పార్టీ అంటే వ్యక్తులు కాదని, మనం పనిచేస్తోంది పార్టీ కోసం, సీఎం చంద్రబాబు కోసమన్నారు. సభ్యత్వ నమోదులో భాగ స్వాములు కాని క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జిల వివరాలు పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకువెళతామన్నారు. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌పై నమ్మకంతో పైలెట్ ప్రాజెక్టుగా అనంత అర్బన్‌లో సభ్యత్వ నమోదు ప్రక్రియ చేపట్టాలని అధిష్ఠానం నిర్ణయించిందన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని సభ్యత్వ నమోదును ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకొని, నిర్దేశించిన సమ యంలోగా వంద శాతం సభ్యత్వ నమోదు పూర్తి చేయాలన్నారు. మాజీ



మాట్లాడుతున్న అర్బన్ నియోజకవర్గ పరిశీలకుడు లక్ష్మీనారాయణ

మేయర్ స్వరూప, రాష్ట్ర నాయకులు బుగ్గయ్య చౌదరి, గంగారామ్, సరి పూటి రమణ, కుంచెపు వెంకటేష్, పోతుల లక్ష్మీనరసింహులు, కడియాల కొండన్న, పరమేశ్వరన్, పీఎం లక్ష్మీప్రసాద్, గుర్రం నాగభూషణం, రహ్మత్ బీ, లక్ష్మీనరసింహ, చేపల హరి, తమ్మినేని వేణుగోపాల్, నెట్టెం బాలకృష్ణ, కంఠాదేవి పాల్గొన్నారు.

థ్యాంక్యూ సార్..!

- ఎంపీ అంబికాకు ఎంపీఈఓల సన్మానం



ఎంపీ అంబికాను సన్మానిస్తున్న ఎంపీఈఓలు

అనంతపురం అర్బన్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎంపీ అంబికా లక్ష్మీ నారాయణకు వ్యవసాయ శాఖ ఎంపీఈఓల సంఘం రాయలసీమ జోన్ అధ్యక్షుడు రెడ్డి ప్రసాద్, ఇతర ఎంపీఈఓలు సన్మానించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఓడీపై పనిచేస్తున్న తమ సమస్యలపై స్పందించి రాష్ట్ర ఉన్నతాధికారులతో చర్చించి, తిరిగి జిల్లాకు రప్పించినందుకు ప్రత్యేక కృతజ్ఞ తలు తెలిపారు. శుక్రవారం నగర శివారులోని ఎంపీ నివాసంలో ఆయనకు శాలువ కప్పి, పూలమాల వేసి, జ్ఞాపికను అందజేశారు. నాయకులు భాస్క ర్‌నాయక్, అరుణ, ఖాసీంబి, సూర్యనారాయణరెడ్డి, రాజేష్ పాల్గొన్నారు.

జాకీ పరిశ్రమ స్థాపించాలన్నదే ఎమ్మెల్యే లక్ష్యం



జాకీ పరిశ్రమకు కేటాయించిన స్థలంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

రాప్తాడు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రంలో జాకీ పరి శ్రమ, ఇతర ఏదైనా పరిశ్రమ స్థాపించి యువతకు ఉపాధి కల్పించాలన్నదే ఎమ్మెల్యే పరిటాల సునీత లక్ష్యం అని టీడీపీ నాయకులు అన్నారు. అసెంబ్లీ సమావేశంలో రాప్తాడులో జాకీ పరిశ్రమ స్థాపించాలని ఎమ్మెల్యే ప్రస్తావిం చడంతో శుక్రవారం రాప్తాడులో టీడీపీ నాయకులు హర్షం తెలిపారు. గతంలో జాకీ పరిశ్రమ కోసం కేటాయించిన స్థలాన్ని నాయకులు పరిశీలిం చారు. వారు మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో 10 వేల మందికి ఉపాధి లభించే జాకీ పరిశ్రమ మంజూరైతే 2019లో వైసీపీ అధికారంలోకి రావడంతో అప్పటి ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, అతని సోదరులు రూ.15 కోట్లు జాకీ నిర్వాహకులను డిమాండ్ చేశారు. దీంతో పరిశ్రమ తెలంగాణకు తరలిపో యిందన్నారు. అసెంబ్లీలో రాప్తాడులో ఏదైనా పరిశ్రమ నిర్మించాలని ఎమ్మెల్యే ప్రస్తావించడం అభినందనీయమన్నారు. మండల కన్వీనర్ కొండప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, సర్పంచ్ సాకే తిరుపాలు, మాజీ కన్వీనర్ నారాయణ స్వామి, గోనిపట్ల శీనా, బాబయ్య, కిష్టా పాల్గొన్నారు.

నిస్సాన్ కార్ల షోరూం ప్రారంభం



నిస్సాన్ న్యూ మాగ్నేట్ కారును ఆవిష్కరిస్తున్న షోరూం ప్రతినిధులు, అతిథులు

అనంతపురం ప్రెస్‌క్లబ్, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): నగరంలో హైటెక్ నిస్సాన్ వారి నిస్సాన్ కార్ల షోరూం ప్రారంభమైంది. రుద్రంపేట బైపాస్ రోడ్డులోని షోరూమ్‌ను శుక్రవారం సంస్థ ప్రతినిధులు, అతిథులు ప్రారంభిం చారు. కార్యక్రమానికి ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ నర్సింహం, షోరూం మేనేజింగ్ డైరెక్టర్ జగన్నాథరెడ్డి, డైరెక్టర్ నిరంజన్ షోరూంతో పాటు, కొత్తగా మార్కె ట్లోకి వచ్చిన నిస్సాన్ న్యూ మాగ్నేట్ కారును ప్రారంభించారు. వారు మాట్లా డుతూ న్యూ మాగ్నేట్ కారులో యాసెంటా, ఎన్ కనెక్టా, టెక్నా, టెక్నా ప్లస్ వేరియంట్లు అందుబాటులో ఉందన్నారు. ఇందులో అమర్చిన 1.0 లీటర్ టర్బో చార్జ్‌డ్, పెట్రోల్ ఇంజన్ 98 బీహెచ్‌పీ, 160 ఎన్ఎం టార్క్‌ను అమర్చి నట్లు తెలిపారు. 5 స్పీడ్ మాన్యువల్ ట్రాన్స్‌మిషన్ లేదా ఈవీటి గేర్ బాక్స్‌తో ఈ కారు మార్కెట్లో లభిస్తోందన్నారు. 6 ఎయిర్ బ్యాగ్‌లు, ఎలక్ట్రా నిక్ స్టెబిలిటీ కంట్రోల్, హిల్‌స్టార్ట్ అసిస్ట్, టైర్ ప్రెజర్ మానిటరింగ్ వ్యవస్థ, ఈబీడీతో కూడిన ఏబీఎస్, ట్రాక్షన్ కంట్రోల్, భద్రతా ఫీచర్లు ఈ కారులో ఉన్నాయన్నారు. జనరల్ మేనేజర్ ఎస్‌వీఎస్ శాస్త్రి, సేల్స్ మేనేజర్ లోకేష్ పాల్గొన్నారు.

ప్రసాద్ స్కూల్‌లో చిల్డ్రన్స్‌డే సందడి



డ్యాన్స్ చేస్తున్న చిన్నారులు

అనంతపురం విద్య, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): నగరంలోని 1వ రోడ్డులో ఉన్న ప్రసాద్ కాన్సెప్ట్ స్కూల్‌లో చిల్డ్రన్స్ డే వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా పాఠశాల కరస్పాండెంట్లు ప్రసాద్, గంగాధర్,నాగరాజు గుప్తా ఆధ్వర్యంలో వేడుకలు కోలాహలంగా సాగాయి. విద్యార్థులు డ్యాన్సులు చేస్తూ సందడి చేశారు. కర స్పాండెంట్లు మాట్లాడుతూ మాజీ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూకు పిల్ల లంటే ఎంతో ఇష్టమన్నారు. అందుకే ఆయన జయంతి రోజునే చిల్డ్రన్స్ డే వేడుకలు నిర్వహిస్తారని గుర్తుచేశారు.

మాంటిస్సోరి విద్యార్థుల ప్రతిభ



పతకాలతో మాంటిస్సోరి విద్యార్థులు

రాప్తాడు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొల్లపల్లి సమీపంలోని మాంటిస్సోరి పాఠశాల విద్యార్థులు ఎస్‌జీఎఫ్ క్రీడల్లో ప్రతిభ కనబరిచినట్లు పాఠ శాల ఎండీ కృష్ణ భరత్ తెలిపారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను శుక్రవారం పాఠశాలలో అభినందించారు. భరత్ మాట్లాడుతూ ఎస్‌జీఎఫ్ క్రీడల్లో విద్యార్థు లు ఖోఖో, వాలీబాల్, బాస్కెట్‌బాల్ పోటీల్లో విజయకేతనం ఎగరవేశారన్నారు. విద్యార్థులను, పీటీలను కరస్పాండెంట్ సమీరా అభినందించారు.

9 నుంచి పీఎస్ఎఫ్ఐ మహాసభలు

అనంతపురం విద్య, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రొగ్రెసివ్ స్టూడెంట్స్ ఫెడరే షన్ ఆఫ్ ఇండియా (పీఎస్ఎఫ్ఐ) రాష్ట్ర మహాసభలు డిసెంబర్ 9 నుంచి నిర్వహిస్తు న్నట్లు అధ్యక్షుడు అబ్దుల్ ఆలం తెలిపారు. ఇందుకు సంబంధించి శుక్రవారం ఆర్ట్స్ కాలేజ్ ప్రిన్సిపాల్ పద్మశ్రీ మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం అబ్దుల్ ఆలం మాట్లాడుతూ పీఎస్ఎఫ్ఐ సంఘం విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతోందన్నారు. వచ్చే నెల 9, 10, 11 తేదీల్లో అనంతపురంలో పీఎస్ఎఫ్ఐ సభలు జరుగుతాయన్నారు. జిల్లా కార్యదర్శి ప్రతిభా భారతి, మౌనిక, అనిల్, కరుణాకర్, సుచిత్ర, వసంత, దతీష్, గణేష్ పాల్గొన్నారు.

క్లుప్తంగా..

పశువుల షెడ్లు త్వరగా పూర్తి చేయాలి

కూడేరు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మంజూరు చేసిన మినీగోకులం పశువుల షెడ్ల నిర్మాణ పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని డ్వామా పీడీ సలీంబాషా ఆదేశించారు. మండలంలోని గొట్కూరు, బ్రహ్మణపల్లి, కరుట్లపల్లి, చోళసముద్రం గ్రామాల్లో శుక్రవారం ఆయన ఉపాధి హామీ కింద జరుగుతున్న మినీ గోకుల షెడ్ల నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం రైతులతో, సిబ్బందితో మాట్లాడుతూ పనులు వీలైనంత త్వరగా పూర్తిచేయాలని తెలిపారు. ఏపీడీ శైలజ, ఏపీఓ తులసీప్రసాద్, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

పత్తికొనుగోలు కేంద్రం ప్రారంభం

గుత్తి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి):పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో పత్తికొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. మార్కెట్ యార్డు కార్యదర్శి బాలాజీ రావు, పత్తికొనుగోలు ఇన్‌చార్జి భరత్ ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ రైతుల సౌకర్యార్థం మార్కెట్ యార్డులో పత్తికొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. పత్తిక్వింటాల్‌కు పొడుగు గింజ రూ.8471లు చొప్పున కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. రైతులు ప్లాస్టిక్ సంచులలో కాకుండా లూజు పద్ధతిలో తెచ్చిన పత్తిని మాత్రమే కొనగోలు చేస్తామన్నారు. రైతులు బ్యాంక్ ఖాతాకు ఆధార్ నెంబరు అనుసంధానం కలిగి ఉండాలని చెప్పారు.

గృహనిర్మాణంపై సమీక్ష

గుంతకల్లుటౌన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని డీఎల్‌డీఓ కార్యాలయంలో శుక్రవారం గుంతకల్లు డివిజన్ స్థాయి సచివాలయ కార్యదర్శులతో గృహనిర్మాణంపై డీఎల్‌డీఓ అధికారి విజయలక్ష్మి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గృహ నిర్మాణాలలో నిర్లక్ష్యం వహించరాదన్నారు. లబ్ధిదారులకు ఇబ్బందులు కలగకుండా నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. లబ్ధిదారులకు ఆర్థిక సమస్యలు ఉంటే వెలుగు, మెప్మాశాఖల అధికారలుతో కలిసి ఎస్‌హెచ్‌జీ ద్వారా రూ.35వేలు ఇప్పించి నిర్మాణాలను పూర్తిచేయించాలని తెలిపారు. సమావేశంలో గుంతకల్లు సబ్ డివిజన్ డీఈఈ షాషావలి, యాడికి ఎంపీడీఓ వీర్రాజు, అసిస్టెంట్ ఇంజనీర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

హైకోర్టు బెంచ్ ఏర్పాటు హర్షణీయం

గుత్తి, నవంబరు22(ఆంధ్రజ్యోతి): కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేసేందుకు అసెంబ్లీలో తీర్మాణం చేయడంపై పట్టణంలోని బార్ అ సోసియేషన్ నాయకులు శుక్రవారం హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ హైకోర్టు బెంచ్ ఏర్పాటుతో పాటు హెచ్ఆర్సీ, లోకయుక్తా, ట్రిబునల్‌ను కర్నూలులో కొనసాగిస్తామని ప్రకటించడం పట్ల సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు రామశర్మ, కార్యదర్శి చంద్రశేఖర్, న్యాయవాదులు మనోహర్ బాబు, మహ్మద్‌రసూల్, సుబ్రహ్మణ్యం, మహబుబ్ బాషా, శ్రీనివాసులు, ఓబులేసు, సొలన్న పాల్గొన్నారు.

జాబ్‌కార్డుల మంజూరుకు చర్యలు

బెళుగుప్ప, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలో అర్హులైన కూలీలందరికీ ఉపాధిహామీ పథకం జాబ్ కార్డుల మంజూరుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఏపీవో సూర్య ప్రకాష్ శుక్రవారం తెలిపారు. మండల వ్యాప్తంగా గ్రామసభలు నిర్వహించి కూలీలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఊర్లో లేని కూలీలు, మృతి చెందిన వారి కార్డులు తొలగించి కొత్త కార్డులు ఇస్తామన్నారు. ఇప్పటివరకు మండలంలో ఆరు వేల కార్డులున్నాయన్నారు. మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సిబ్బందికి గ్రామసభ నిర్వహించి పలు అంశాలపై అవగాహన కల్పించారు. టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, సెక్రెటరీ శివరంజని తదితరులు పాల్గొన్నారు.


ట్రాన్స్‌ఫార్మర్ చోరీ

పుట్లూరు, నవంబరు22(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏ. కొండాపురం గ్రామంలో శుక్రవారం రైతు వెంకటనాయుడుకు చెందిన ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. వెంకటనాయుడుకు చెందిన మొక్కజొన్న తోటలో ట్రాన్స్‌ఫార్మర్‌కి దుండగులు విద్యుత్ కనెక్షన్ తీసివేసి లోపల ఉన్న కాపర్, ఆయిల్‌ను ఎత్తుకెళ్లారు. విషయం తెలుసుకున్న రైతు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలాన్ని ఎస్ఐ హేమాద్రి, ట్రాన్స్‌కో ఏఈ విజయ్‌కుమార్ పరిశీలించారు. సుమారు రూ.30వేలు నష్టం వాటిల్లినట్లు తెలిపారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

అభివృద్ధి పనులకు నిధులు కేటాయించండి

● సీఎం చంద్రబాబుకు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు వినతి

కళ్యాణదుర్గం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కళ్యాణదుర్గం నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని సీఎం చంద్రబాబుకు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు విన్నవించారు. అమరావతిలో శుక్రవారం ఆయన సీఎంను కలిసి మాట్లాడారు. నియోజకవర్గంలో భైరవానితిప్ప ప్రాజెక్టు పనులకు నిధులు కేటాయించి త్వరితగతిన పనులు పూర్తయ్యేలా చూడాలని కోరారు. అదేవిధంగా కళ్యాణదుర్గం పట్టణానికి మహిళా డిగ్రీ కళాశాల, డైట్ కళాశాల మంజూరు చేయాలని విన్నవించారు. అదేవిధంగా అక్కడ డ్రైనేజీ వ్యవస్థ మెరుగుకు, రోడ్ల అభివృద్ధికి నిధులు కేటాయించాలన్నారు. సామాజిక ఆరోగ్య కేంద్రానికి అదనంగా వందపడకలను మంజూరు చేయాలని కోరుతూ వినతిపత్రం ఇచ్చారు. ఇందుకు సీఎం సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే అమిలినేని తెలిపారు.


సీఎంకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే అమిలినేని



సీఎం సహాయనిధికి డ్వాక్రా మహిళల విరాళం

అమరావతి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : సీఎం సహాయ నిధికి రాయదుర్గం నియోజకవర్గానికి చెందిన డ్వాక్రా మహిళలు రూ.9 లక్షల విరాళాన్ని అందించారు. అసెంబ్లీలో సీఎం చంద్రబాబును శుక్రవారం కలిసి చెక్కును అందించారు. వీరిని సీఎం చంద్రబాబు అభినందించారు. కార్యక్రమంలోమాజీ మంత్రి, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీకి సహకరించండి

విడపనకల్లు, నంవబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో 2023-2024 సంవత్సరంలో జరిగిన ఉపాధి హామీ పనులపై నిర్వహించే సామాజిక తనిఖీకి అందరూ సహకరించాలని ఎస్ఆర్పీ లక్ష్మీనారాయణ తెలిపారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఎంపీడీఓ షకీలా బేగం ఆధ్వర్యంలో సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఇందులో ఎస్ఆర్పీ మాట్లాడుతూ 17 పంచాయతీల్లో జరిగిన ఉపాధి పనులపై రికార్డులు ఆధారంగా తనిఖీలు చేస్తామని, ప్రతి గ్రామంలోని పనుల వివరాలను ఫీల్డ్ అసిస్టెంట్‌లు డీఆర్పీలకు అందించి సహకరించాలని కోరారు. సహకరించకపోతే పీడీకి ఫిర్యాదు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీఓ సంజీవ తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా రాతిదూలం లాగుడు పోటీలు

బొమ్మనహాళ్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని దర్గాహోన్నూరు గ్రామంలో శుక్రవారం ఉరుసు ఉత్సవాలను పురస్కరించుకుని రాతిదూలం లాగుడు పోటీలను ఘనంగా నిర్వహించారు. టీడీపీ బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు కేశప్ప, నాయకులు హనుమంతు, ఆనంద్, నాగరాజు, వన్నూరప్ప, రఫీ, రామంజనేయులు, .ఈ పోటీలను ప్రారంభించారు. దర్గాహోన్నూరుకు చెందిన తొమ్మిది జతలు వృషభాలు పోటీలో పాల్గొన్నాయి. విజేత వృషభాల యజమానులకు వరుసగా రూ. 15 వేలు, రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.5 వేలు చొప్పున కేశప్ప చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. పోటీలను తిలకించేందుకు వివిధ గ్రామాల నుండి ప్రజలు పెద్దఎత్తున తరలి వచ్చారు.

ఎన్నికలు సజావుగా నిర్వహించాలి

రాయదుర్గంరూరల్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): సాగునీటి ఎన్నికలను సజావుగా జరపాలని అధికారులకు, ఎన్నికల సిబ్బందికి ఆర్డీఓ వసంతబాబు సూచించారు. పట్టణంలోని మద్దానేశ్వస్వామి ఆలయంలో శుక్రవారం ఆయన నియోజకవర్గంలోని మండలస్థాయి అధికారులకు ఎన్నికల నిర్వహణపై శిక్షణ నిర్వహించారు. ఎన్నికలను ఏ విధంగా నిర్వహించాలి. నిబంధనలు ఏ విధంగా పాటించాలనే విషయంపై వివరించారు. కార్యక్రమంలో ఏఓలు, ఏఈఓలు, ట్రైనర్ రాజ్‌కుమార్, ఐదు మండలాల ఎమ్మార్వోలు డీఈలు ఇతర అధికారులు పాల్గొన్నారు.

వైసీపీ కన్వీనర్ రాజీనామా!

డీ.హీరేహాళ్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): వైసీపీ మండల కన్వీనర్ వన్నూరుస్వామి తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. వైసీపీ ఆవిర్భావం నుంచి ఆయన పార్టీలో పనిచేశారు. అప్పట్లో కాపు రామచంద్రారెడ్డికి ప్రధాన అనుచరుడిగా ఉన్నారు. సుమారు 10 ఏళ్లకు పైగా కన్వీనర్‌గా కొనసాగారు. గత ఎన్నికల్లో వైసీపీ అధిష్టానం కాపు రామచంద్రారెడ్డికి ఎమ్మెల్యే టిక్కెట్టు ఇ వ్వలేదు. దీతో వన్నూరుస్వామి అప్పటి నుంచి తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఈ క్రమంలో కన్వీనర్ పదవికి రాజీనా మా నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. మండలకేంద్రం సమీపంలో ఉన్న ఒక తోటలో శుక్రవారం ఆయన కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు.

చిన్నారికి ఆర్థికసాయం

కళ్యాణదుర్గం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన రెండో తరగతి విద్యార్థి లిఖిత ఈ నెల 14వ తేదీన డెంగీ జ్వరంతో తీవ్ర అస్వస్థతకు గురైంది. నిరుపేద కుటుంబం కావడంతో చిన్నారి ఆస్పత్రి ఖర్చులకు స్థానిక ఉపాధ్యాయుడు, ఇన్నిసిటీ చారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ బద్దేనాయక్ శుక్రవారం తన మిత్ర బృందంతో కలిసి ఆర్థిక సాయం అందజేశారు. బద్దేనాయక్ రూ. 10 వేలు, మిత్రులు సురేష్ రూ. 5 వేలు, హరీష్ రూ. 5 వేల నగదును ఆ చిన్నారి బాబాయ్ పురుషోత్తమ్‌కు అందజేశారు.

హామీల అమలుకు ఉద్యమిస్తాం: ఏపీటీఎఫ్

కుందుర్పి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ హామీల అమలుకై ఉద్యమిస్తామని ఏపీటీఎఫ్ నాయకులు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఏపీటీఎఫ్ జోనల్ సమావేశం జోన్ కార్యదర్శి బొమ్మయ్య అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథులుగా రాష్ట్ర మాజీ కార్యదర్శి నరసింహులు, జిల్లా అధ్యక్షుడు రాయల్ వెంకటేష్, సీనియర్ నాయకులు బి వెంకటేశ్వర్లు, బసవరాజు హాజరై మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలన్నింటినీ వెంటనే అమలు చేయాలన్నారు. ముఖ్యంగా జీవో 117ను రద్దు చేయాలని, 12వ పీఆర్సీ అమలు చేయాలని, అపార ప్రక్రియబాధితులు నుంచి ఉపాధ్యాయులను మినహాయించాలని, పెంచిన పాఠశాలల సమయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఉద్యమిస్తామని హెచ్చరించారు. నా యకులు, తిమ్మప్ప, ఈరప్ప, కృష్ణ, సంగప్ప, వీరాంజనేయులు, వీరన్న, గురుమూర్తి పాల్గొన్నారు.

విత్తన వేరుశనగ మంజూరు

కుందుర్పి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : రబీసీజన్‌కు సంబంధించి మండలానికి 250 క్వింటాళ్ల విత్తన వేరుశనగ కే6 రకం మంజూరైనట్లు ఏఓ మహేష్ శుక్రవారం తెలిపారు. బోరుబావుల కింద సాగు చేసే రైతులు తమ గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల వద్ద విత్తన వేరుశనగ కోసం ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని చెప్పారు.

నాటు సారా స్వాధీనం

కళ్యాణదుర్గం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో గల నాటు సారా తయారీ కేంద్రాలపై, విక్రయదారుల ఇళ్లపై కళ్యాణదుర్గం ఎక్సైజ్ సీఐ అన్నపూర్ణ, ఎస్ఐ హరికృష్ణ శనివారం సిబ్బందితో కలిసి దాడులు చేశారు. కళ్యాణదుర్గం మండలం కాపార్ల పల్లి గ్రామంలో నాటు సారా విక్రయిస్తున్న వడిత్య చిట్టిబాయిను అదుపులోకి తీసుకుని ఆమె వద్ద నుంచి మూడు లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా బెళుగుప్ప మండలం పెనకలపాడులో 300 లీటర్ల ఎఫ్‌జే వాష్‌ను, తగ్గుపర్తిలో 200 లీటర్ల ఎఫ్‌జే వాష్‌ను స్వాధీనం చేసుకుని ఒకరిని అదుపులోకి తీసుకున్నారు.

ఎక్సైజ్ స్టేషన్ల తనిఖీ

రాయదుర్గంరూరల్/ కణేకల్లు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌ను ఎక్సైజ్ జిల్లా డిప్యూటీ కమిషనర్ నాగమద్ద య్య, అసిస్టెంట్ కమిషనర్ మునిస్వామి శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భం గా పలు కేసులకు సంబంధించిన రికార్డులు పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ నియోజకవర్గంలో కర్ణాటక మ ద్యం, నాటుసారా, గంజాయి అరికట్టడానికి విస్తృతంగా దాడులు నిర్వహించాలన్నారు. పాత ముద్దాయిలను, అనుమానితులను తహసీల్దార్ ఎదుట హాజరుపరచి బైండోవర్ చేయించాలని సూచించారు. ఎక్సైజ్ సీఐ సోమశేఖర్, ఎస్ఐ పవన్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే కణేకల్లు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌ను కూడా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. సీఐ ఉమాబాయ్ పాల్గొన్నారు.

ఘనంగా దర్గాహొన్నూరు ఉరుసు

బొమ్మనహాళ్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని దర్గాహొన్నూరులో సయ్యద్ సర్మస్ వలి చిష్తి ఉరుసు ఉత్సవాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. వన్నళ్లి గ్రామంలోని టీడీపీ నాయకుడు కేపీ వన్నూరుస్వామి ఇంటి నుంచి దేవుడి గుర్రాన్ని సవారిగా తీసుకొచ్చి దర్గాలో పూజలు నిర్వహించారు. పీఠాధిపతి ముతవల్లి సయ్యద్ షా రహంతుల్లా ప్రార్థనలు జరిపారు. అనంతరం గ్రామ పురవీధుల్లో షంషేర్ నిర్వహించారు. ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి భక్తులు వేల సంఖ్యలో తరలి వచ్చి దర్గాలో స్వామి వారి సమాధిని దర్శించుకున్ని ప్రార్థనలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

అక్రమ వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు

యాడికి, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు వచ్చే వినియోగదారులతో అక్రమ వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జిల్లా రిజిస్ట్రార్ భార్గవ్ హెచ్చరించారు. యాడికి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన తనిఖీచేశారు. ఈ సందర్భంగా అక్కడి పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ సాధారణ తనిఖీల్లో భాగంగానే ఇక్కడికి వచ్చినట్లు తెలిపారు. వివిధ సేవల నిమిత్తం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చే ప్రజల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని అధికారులకు , సిబ్బందికి హెచ్చరించారు. ఈనెలలో జరిగిన రిజిస్ట్రేషన్‌లపై ఆరాతీశారు. తర్వాత రిజిస్టర్ అయిన పలు డ్యాక్యుమెంట్లను తీసుకొని ఫీల్డ్ విజిట్ చేశారు. ఆయన వెంట యాడికి సబ్ రిజిస్ట్రార్ జాఫర్ సాధిక్ ఉన్నారు.


రికార్డులు తనిఖీచేస్తున్న జిల్లా రిజిస్ట్రార్

అక్రమాలపై విచారణ చేపట్టండి

రాయదుర్గంరూరల్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ రైటర్లు, ప్రైవేటు వ్యక్తుల అగ్రిమెంట్ల కార్యాలయాల అక్రమాలపై విచారణ చేపట్టాలని సీపీఐ పట్టణ కార్యదర్శి కొట్రేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సబ్ రిజిస్ట్రార్ రైటర్లు, ప్రైవేటు వ్యక్తుల అగ్రిమెంట్ల కార్యాలయాల అక్రమాలపై విచారణ చేపట్టాల అన్నారు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్దకు నిత్యం అనేక మంది ఇంటి స్థలాలు, భూములు కొనుగోలు, అమ్మకాల కోసం అనేక మంది వస్తుంటారని, వారికి రకరకాల కారణాల చెబుతూ రైటర్లు వేలల్లో దోచుకుంటున్నట్లు తెలిపారు. వాటిని అరికట్టడానికి చర్యలు తీసుకవాలని కోరారు. నాయకులు నరసింహులు, తిప్పేస్వామి, మారెన్న, ఏఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి ఆంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

పెద్దపప్పూరు, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మనచెరువులో వజ్రగిరి లక్ష్మినరసింహస్వామి ఆలయం వద్ద పలు అభివృద్ధి పనులను నియోజకవర్గ టీడీపీ నాయకుడు ఎస్వీ రవీంద్రారెడ్డి శుక్రవారం ప్రారంభించారు. అభివృద్ధి పనులు త్వరగా ముగించేటట్లు చూడాలని ఆయన మున్సిపల్ ఛైర్మన్ ను ఆదేశించారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో ఒకరికి గాయాలు

యాడికి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయలచెరువు వద్ద శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డుప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. నంద్యాల జిల్లా రుద్రవరం మండలం లింగాల దిన్నె గ్రామానికి చెందిన ఓబులేసు ఐషర్ తీసుకుని తాడిపత్రికి వస్తున్నాడు. కాగా రాయలచెరువు వద్ద వాహనాన్ని రోడ్డుపక్కన నిలబెట్టి క్యాబిన్‌లో నిద్రించాడు. అయితే ఆ వాహనాన్ని తాడిపత్రి నుంచి గుత్తి వైపు వెళుతున్న లారీ ఢీకొంది. ఈ సంఘటనలో నిద్రిస్తున్న ఓబులేసు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం తాడిపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కొత్తపేట శివారులో యువకుడికి ..

గుత్తిరూరల్: మండలంలోని కొత్తపేట గ్రామశివారులోని 67వ జాతీయ రహదారిపై శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలయ్యాయి. కొత్తపేట గ్రామానికి చెందిన యువకుడు మహబుబ్‌బాషా బైకుపై గుత్తికి వెళ్లి కొద్దిసేపటి అనంతరం స్వగ్రామానికి బయలుదేరాడు. అయితే గ్రామశివారులోకి రాగానే బైక్ అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

కోనాపురం సమీపంలో ముగ్గురికి..

ఉరవకొండ: మండలంలోని కోనాపురం గ్రామసమీపంలో కారు, ద్విచక్రవాహనం ఢీ కొని ముగ్గురికి గాయాలయ్యాయి. కోనాపురం నుంచి సుధాకర్, రాజమ్మ ద్విచక్రవాహనంలో వెళ్తుండగా.. బళ్లారి వైపు నుంచి వస్తున్న కారు ఢీ కొంది. ప్రమాదంలో సుధాకర్, రాజమ్మతో పాటు, కారులో ఉన్న ఒకరికి గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను అనంతపురం ఆసుపత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

డీ .హీరేహాళ్, నవంబరు 22: మండలంలోని మురడి గ్రామానికి చెందిన గంగాధర భార్య శైలజ కుటుంబ కలహాల కారణంగా ఈ నెల 10వ తేదీన ఇంట్లో ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పు అంటించుకుని ఆత్మహత్యకు యత్నించింది. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే చికిత్స కోసం అనంతపురం ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. తర్వాత మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం ఆమె మృతి చెందినట్లు ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు. భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మట్కా బీటర్ అరెస్టు

రాయదుర్గంరూరల్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కాసు మల్లమ్మ ఆలయ సమీపంలో గల ఓబుళాచారిరోడ్డు వద్ద స్థానికుడైన ఓ మట్కా బీటర్‌ను శుక్రవారం అరెస్టు చేసినట్లు సీఐ జయనాయక్ తెలిపారు. మట్కా రాస్తున్నాడని సమాచారం అందడంతో దాడి చేసి మట్కాబీటర్‌ను అరెస్టు అదుపులోకి తీసుకున్నామని, అతని వద్ద నుంచి రూ. 35 వేలు నగదును, మట్కా చీటీలను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. తర్వాత కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు.

గుత్తి: పట్టణంలోని ఆర్ఎస్‌లో ఓ మట్కా బీటర్‌ను అరెస్టు చేసినట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు. మట్కా నిర్వహిస్తున్నరని సమాచారం మేరకు దాడులు అరెస్ట్ చేశామని, అతడి వద్ద నుంచి రూ. 11800లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఆయన చెప్పారు.

ఆలయ భూముల లెక్కలు సరిచేస్తాం

● దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ ఆదిశేషునాయుడు

యాడికి, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయ భూముల లెక్కలను త్వరలోనే తేలుస్తామని దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ ఆదిశేషునాయుడు తెలిపారు. లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయానికి శుక్రవారం ఆయన వచ్చారు. ఈ సందర్భంగా గ్రామస్థులు, ఆలయ అర్చకుడితో ఆలయ భూములు, ఇతర వివరాలపై ఆరాతీశారు. అనంతరం మాట్లాడుతూ 1969లెక్కల ప్రకారం చెన్నకేశవస్వామి ఆలయ భూములు 251.19ఎకరాలు ఉన్నాయని తెలిపారు. వీటిలో కొన్నింటిని వేలం వేశారని, మిగిలిన భూములపై లెక్కలు తేల్చాల్సి ఉందని అన్నారు. ఆయన వెంట దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ వన్నూర్‌స్వామి, సీనియర్ అసిస్టెంట్ రామతులసి ఉన్నారు.


అర్చకుడితో మాట్లాడుతున్న అసిస్టెంట్ కమిషనర్

ఆలయ ఈఓ తీరుపై ఫిర్యాదు

చెన్నకేశవస్వామి ఆలయ ఈఓ దుర్గాప్రసాద్ తీరుపై పలువురు గ్రామస్థులు దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. నెలరోజులుగా ఈఓ దేవస్థానం వైపు వచ్చింది లేదన్నారు. ఆలయ పర్యవేక్షణ పట్ల తీవ్ర నిర్లక్ష్యంగా ఉంటారని వాపోయారు. దీంతో అసిస్టెంట్ కమిషనర్ ఈఓపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

సౌత్ జోన్ కబడ్డీ పోటీలకు ఎస్కేపీ విద్యార్థిని

గుంతకల్లుటౌన్, నవంబరు 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్కేపీ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ మొదటి సంవత్సరం విద్యార్థిని ఎన్ ప్రమీల సౌత్‌జోన్ కబడ్డీ పోటీలకు ఎంపికైందని కళాశాల ప్రిన్సిపాల్ జ్ఞానేశ్వర్ తెలిపారు. ఇటీవల యూనివర్శిటీ స్థాయిలో ప్రమీల ప్రతిభ కనబరిచి సౌత్‌జోన్ పోటీలకు ఎంపికైందన్నారు. ఈనెల 29నుంచి డిసెంబరు 2 వరకు చెన్నైలో నిర్వహించే సౌత్‌జోన్ పోటీల్లో ఆమె పాల్గొననున్నట్లు చెప్పారు. ప్రమీలను కళాశాల అధ్యాపకులు శుక్రవారం అభినందించారు.

రోడ్డుకు ఇరువైపులా కంపచెట్ల తొలగింపు

కూడేరు, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చోళసముద్రం, జయపురం గ్రామాల మధ్య ప్రధాన రహదారికి ఇరువైపులా పెరిగిన కంప చెట్లను చోళసముద్రం సర్పంచ్ వడ్డే రమాదేవి, భర్త వడ్డేరాజు ఎక్స్‌కవేటర్‌తో తొలగింపజేశారు. ప్రధాన రహదారికి ఇరువైపుల కంపచెట్లు ఏపుగా పెరడగంతో వాహనదారులు రాకపోకలు సాగించాలంటే ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, టీడీపీ నేత పయ్యావుల శ్రీనివాసులు కంపచెట్లను తొలగించాలని సర్పంచు వడ్డే రమాదేవి, భర్త రాజుకు సూచించారు. దీంతో వారు రహదారి పక్కనున్న కంపలను రెండ్రోజులుగా తొలగింపజేస్తున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.


కంప చెట్లను తొలగింపజేస్తున్న టీడీపీ నాయకులు

మృతురాలి కుటుంబానికి పరామర్శ

కళ్యాణదుర్గం, నవంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గోళ్ల గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త సర్మస్ భార్య అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న పార్టీ నాయకుడు ధర్మతేజ ఆ గ్రామానికి వెళ్లి ఆమె భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం సర్మస్‌ను ఓదార్చి రూ.పది వేల ఆర్థికసాయం అందజేశారు.

